RNI TELTEL/2024/89620

నేటి
# శుభోదయం
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

Gk MEDIA

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 02, సంచిక 87, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, మంగళవారం - 01 - జూలై - 2025 , వెల రూ.5/-

## మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది

చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీకి దాసోహమయ్యారన్న షర్మిల

కాంగ్రెస్ లోకి రావాలంటూ నేతలు, యువతకు సూచన

రాహుల్ ప్రధాని అయితే విభజన హామీలు అమలవుతాయని వ్యాఖ్య



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దాసోహమయ్యారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించే సత్తా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం ఈ జూన్ నెలలోనే 26 జిల్లాల్లో సుమారు 2,500 కిలోమీటర్లు పర్యటించానని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కినా, రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా మిగతా..2లో

## భారతీయులకు ట్రంప్ భారీ ఊరట..

అమెరికాలో రెమిటెన్స్ పన్నుపై ప్రవాస భారతీయులకు ఊరట

తొలుత ప్రతిపాదించిన 5 శాతం పన్నును 1 శాతానికి తగ్గింపు

బ్యాంక్, క్రెడిట్/డెబిట్ కార్డు లావాదేవీలకు పూర్తి మినహాయింపు

సెనెట్‌లో స్వల్ప మెజారిటీతో కీలక బిల్లుకు ఆమోదం

'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'లో భాగంగా ఈ నిర్ణయం



ఢిల్లీ : అమెరికాలో నివసిస్తున్న లక్షలాది మంది ప్రవాస భారతీయులకు ఊరట లభించింది. స్వదేశంలోని తమ కుటుంబాలకు పంపే నగదుపై (రెమిటెన్స్) విధించాలని ప్రతిపాదించిన పన్నును ప్రభుత్వం తగ్గించింది. తొలుత 5 శాతంగా ఉన్న ఈ పన్నును తాజాగా ఒక శాతానికే పరిమితం చేస్తూ ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మిగతా..2లో

## తెలంగాణలో ప్రమాదంపై ప్రధాని మోదీ సహా ప్రముఖుల విచారం

- తెలంగాణలోని పాశమైలారంలో జరిగిన ప్రమాదంపై ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ విచారం వ్యక్తం చేశారు.
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
- మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాము' అని ప్రధాని మోదీ ప్రకటించారు
- 'తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డిలో ఒక కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం.




అమరావతి, జూన్ 30: తెలంగాణ రాష్ట్రంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. రసాయనిక పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికులు మృతిచెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే పీఎంఆర్ఎఫ్ ఫండ్ నుంచి మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రధాని మోదీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

**ప్రమాదంపై ప్రధాని మోదీ ట్వీట్** మిగతా..2లో

## రేవంత్ పాలనా వైఫల్యంతో నిర్వీర్యమవుతున్న గురుకులాలు



- రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల నిర్వీర్యం అవుతుండటం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు.
- రేవంత్ పాలనలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుండటం శోచనీయమని వెల్లడించారు.

## రాజాసింగ్ రాజీనామా.. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- బీజేపీ బీసీ వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్న మంత్రి పొన్నం
- అధ్యక్ష పదవికి బీసీ నేతను డ్డుకున్నారంటూ తీవ్ర ఆరోపణ
- రాజా సింగ్ రాజీనామాతో బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు
- బీజేపీ ఒక ఫ్యూడల్ పార్టీ అని పొన్నం ఘాటు వ్యాఖ్యలు
- సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టీకరణ




హైదరాబాద్ : బీజేపీ మరోసారి తన బీసీ వ్యతిరేక వైఖరిని స్పష్టంగా బయటపెట్టుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమ ర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాజీనామా చేయడంపై ఆయన స్పందిస్తూ, ఆ పార్టీని ఒక ఫ్యూడల్ పార్టీగా అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా బీజేపీపై విమర్శలు చేశారు.

**బీసీ నేతను అడ్డుకున్నారు: పొన్నం**

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వేయడానికి ప్రయత్నిస్తే,

## జనవరి 1 నుంచి క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు

### ఐటీ వృద్ధి చెందితేనే మనం అభివృద్ధి చెందగలమని

- అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీపై నేషనల్ వర్క్‌షాప్
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన విజయవాడలో వర్క్‌షాప్
- పాల్గొన్న ప్రముఖ ఐటీ, బహుళజాతి సంస్థల ప్రతినిధులు
- ఇంజినీరింగ్ కళాశాలలు అనేకం వచ్చేలా చూశామని వెల్లడించారు.
- ప్రపంచంలో అత్యధికంగా సంపాదించేది భారతీయులేనని, అమెరికా సిలికాన్ వ్యాలీని ఆదర్శంగా తీసుకొని క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టామని




అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీపై నేషనల్ వర్క్‌షాప్? విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్క్‌షాప్‌లో ప్రముఖ ఐటీ, బహుళజాతి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా కేంద్ర

అమరావతి: భవిష్యత్తులో ప్రతీది ఐటీతో ముడిపడి ఉంటుందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఐటీ వృద్ధి చెందితేనే మనం అభివృద్ధి చెందగలమని చెప్పారు.

ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. అత్యధికంగా సంపాదించేది భారతీయులే:

## సార్క్‌కు పోటీగా కొత్త కూటమి ఏర్పాటుకు చైనా, పాకిస్థాన్ ప్రయత్నాలు



- ఇటీవల చైనాలో బంగ్లాదేశ్ ప్రతినిధులతో రహస్యంగా చర్చలు
- కొత్త కూటమి వార్తలను ఖండించిన బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం
- పనిచేయకుండా ఉన్న సార్క్‌ను పూర్తిగా పక్కనపెట్టేందుకే ఈ ప్లాన్
- కొత్త గ్రూప్‌లో భారత్‌ను కూడా చేర్చుకునే అవకాశాలు ఉన్నాయని ప్రచారం
- 2016 యూరీ దాడి తర్వాత ఆగిపోయిన సార్క్ సమావేశాలు

అమరావతి :దక్షిణాసియాలో దశాబ్దాలుగా కీలక పాత్ర పోషించిన సార్క్ కూటమికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త గ్రూప్‌ను ఏర్పాటు చేసేందుకు చైనా, పాకిస్థాన్‌లు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్వీర్యంగా ఉన్న సార్క్ స్థానంలో ఈ కొత్త వేదికను తీసుకురావాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది. ఈ మేరకు పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' దౌత్యవేత్తలను ఉటంకిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. పాకిస్థానీ మీడియా కథనం ప్రకారం, ఈ కొత్త కూటమి ఏర్పాటుపై చైనా, పాకిస్థాన్‌ల మధ్య ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిగాయి. ఇందులో భాగంగానే ఇటీవల చైనాలోని కున్మింగ్ నగరంలో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సార్క్‌లోని మిగతా దేశాలైన శ్రీలంక, మాల్దీవులు, అఫ్గానిస్థాన్‌లను కూడా మిగతా..2లో

## ఇరాన్‌కు 30 బిలియన్ డాలర్ల ఆఫర్ స్పందించిన డొనాల్డ్ ట్రంప్

- ఇరాన్‌కు భారీ ఆఫర్లు ఇచ్చానన్న వార్తలను ఖండించిన ట్రంప్
- అణు కార్యక్రమం నిలిపేస్తే 30 బిలియన్ డాలర్ల సాయం అని ప్రచారం
- అదంతా మీడియా సృష్టిస్తున్న తప్పుడు ప్రచారమని వెల్లడి
- దాడులు చేయమని అమెరికా హామీ ఇస్తేనే చర్చలన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికా దాడుల తర్వాత నిలిచిపోయిన అణు చర్చలు



ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేస్తే భారీ ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్న వార్తలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఇదంతా మీడియా సృష్టిస్తున్న తప్పుడు ప్రచారమని ఆయన కొట్టిపారేశారు. ఇరాన్‌కు ఎలాంటి ఆఫర్లు ఇవ్వలేదని, ఆ ఆలోచనే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో స్పందించారు. "ఇరాన్‌కు నేను ఎలాంటి ఆఫర్లు ఇవ్వడం లేదు. మిగతా..2లో

## బంకర్ బస్టర్ల దిశగా.. భారత్ అడుగులు




భారత్ సైతం బంకర్ బస్టర్ క్షిపణుల తయారీకి ముందడుగు వేస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి.

భారత ప్రభుత్వం తన ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపాయి.

అమెరికా ఇరాన్‌పై 'జీబీయూ-57 ఏ/బీ' అనే ఆరు భారీ ఆర్డినెన్స్ పెనట్రేటర్ బాంబులు ప్రయోగించింది.

ఢిల్లీ : గతవారం ఇరాన్‌లోని కీలక అణు శుద్ధి కేంద్రాలైన 'ఫోర్డో', నతాంజ్ అణుశుద్ధి కేంద్రాలపై అగ్రరాజ్యం బంకర్ బస్టర్లను ప్రయోగించి తీవ్ర నష్టం కలిగించిన విషయం తెలిసిందే. దీంతో ప్రపంచమంతా వాటి సామర్థ్యాన్ని చూసింది.

## దక్షిణాసియా క్వాంటం కేంద్రంగా అమరావతి

- అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీపై నేషనల్ వర్క్‌షాప్
- వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖ ఐటీ, బహుళజాతి సంస్థల ప్రతినిధులు
- అధునాతన సాంకేతిక కేంద్రంగా అమరావతిని మారుస్తాం




అమరావతి : చంద్రబాబు సాంకేతిక విప్లవంలో రెండో చాప్టర్ క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ అని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఆయన మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు తాను ఏడో తరగతి చదువుతున్నట్లు చెప్పారు. దక్షిణాసియా క్వాంటం కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీపై విజయవాడలోని ఓ హోటల్‌లో ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్ కార్యక్రమంలో

# భారతీయులకు ట్రంప్ భారీ ఊరట..

ఈ మేరకు కీలకమైన బిల్లు అమెరికా సెనెట్‌లో ఆమోదం పొందింది.

బ్యాంకు లావాదేవీలకు మినహాయింపు

డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'లో ఈ రెమిటెన్స్ పన్నును చేర్చారు. తాజా ముసాయిదా ప్రకారం, ఈ పన్నును ఒక శాతానికి తగ్గించారు. అయితే, బ్యాంక్ ఖాతాలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల ద్వారా చేసే నగదు బదిలీలకు ఈ పన్ను నుంచి పూర్తి మినహాయింపు కల్పించడం గమనార్హం. కేవలం మనీ ఆర్డర్, క్యాషియర్ చెక్కుల వంటి మార్గాల్లో పంపే సొమ్ముకు మాత్రమే ఈ ఒక శాతం పన్ను వర్తిస్తుందని బిల్లులో స్పష్టం చేశారు.

### తొలగిన ఆందోళన

వాస్తవానికి, ఈ ఏడాది మే నెలలో ఈ పన్నును తొలిసారిగా 5 శాతం చొప్పున విధించాలని ప్రతిపాదించారు. అమెరికా పౌరులు కాకుండా, హెచ్1బీ వీసాదారులు, గ్రీన్‌కార్డు హోల్డర్లు విదేశాలకు పంపే నిధులపై ఇది వర్తిస్తుందని పేర్కొనడంతో ప్రవాస భారతీయుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నిర్ణయం అమలైతే, ఏటా వారిపై దాదాపు 1.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 13,600 కోట్లు) అదనపు భారం పడుతుందని అప్పట్లో అంచనాలు వెలువడ్డాయి. తాజా నిర్ణయంతో ఆ ఆందోళన తొలగిపోయింది.

# మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది

కేంద్రాన్ని నిలదీసే పరిస్థితిలో లేరని షర్మిల ఆరోపించారు. "కేంద్రంలో మోదీ అధికారంలో ఉండటానికి చంద్రబాబే కారణం. అయినా కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన కేంద్రంపై కనీస ఒత్తిడి తీసుకురావడం లేదు. మరోవైపు, కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన జగన్ చివరికి తన మెడనే మోదీ ముందు వంచారు" అని ఆమె ఎద్దేవా చేశారు. జగన్ ఇప్పటికీ మోదీని ఒక్క మాట అనకుండా, కేవలం చంద్రబాబును విమర్శిస్తూ దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు కుదిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా, రాష్ట్రం నుంచి ఒక్క ఎంపీ కూడా దానిపై మాట్లాడకపోవడం దారుణమని షర్మిల మండిపడ్డారు. రాజధాని అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇవ్వడమేంటని ఆమె ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామన్న హామీపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదని గుర్తుచేశారు. విభజన హామీలు ఏవీ అమలు కాకపోయినా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోదీకి మద్దతు పలకడం విచారకరమన్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మొదటి నుంచి బీజేపీని వ్యతిరేకించారని, కానీ జగన్ మాత్రం మోదీకి గులాంగిరీ చేశారని విమర్శించారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని షర్మిల ధీమా వ్యక్తం చేశారు. "రాజకీయాలపై ఆసక్తి ఉండి, భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనుకునే వారు, రాష్ట్రానికి సేవ చేయాలనుకునే వారు కాంగ్రెస్‌లోకి రావాలి. అందరం కలిసి పనిచేద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, వైఎస్ఆర్ వంటి నేతల త్యాగాలతో నిండిన కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాష్ట్ర విభజన హామీలు పూర్తిగా అమలవుతాయని పేర్కొంటూ, సోనియా, రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ తిరిగి బలపడుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# తెలంగాణలో ప్రమాదంపై ప్రధాని మోదీ సహా ప్రముఖుల విచారం

'తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డిలో ఒక కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాము' అని ప్రధాని మోదీ ప్రకటించారు.

### ప్రమాదంపై పవన్ ఆవేదన

తెలంగాణ రాష్ట్రంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడం మూలంగా చోటు చేసుకున్న ఈ పరిశ్రమలో గాయపడ్డవారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికీ, ఇతర క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను' అంటూ డిప్యూటీ సీఎం పవన్ ట్వీట్ చేశారు.

### దిగ్భ్రాంతికి గురిచేసింది: మంత్రి లోకేష్

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో 8 మంది మృతి చెందిన విషయం దిగ్భ్రాంతి కలిగించింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడిన వార్త ఆందోళనకు గురిచేసింది. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# రేవంత్ పాలనా వైఫల్యంతో నిర్వీర్యమవుతున్న గురుకులాలు

హైదరాబాద్ : బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శమైన గురుకులాలు, రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల నిర్వీర్యం అవుతుండటం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. విద్యావ్యవస్థ పట్ల కాంగ్రెస్ చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆరోపించారు. రేవంత్ పాలనలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుండటం శోచనీయమని వెల్లడించారు. జనవరి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కోడిగుడ్లు, మాంసం, అరటి పండ్ల సరఫరా నిలిచిపోయాయని చెప్పారు. బకాయిలు చెల్లించకుంటే జులై 1 నుంచి అన్ని రకాల ఆహార పదార్థాలు, ఇతర సామాగ్రి సరఫరాను నిలిపేస్తామని హెచ్చరించే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. మరోవైపు 13 నెలలుగా రూ.450 కోట్లకుపైగా అద్దె బకాయిలు చెల్లించక భవనాల యజమానులు తాళాలు వేస్తున్న దుస్థితి నెలకొన్నదని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటికీ యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, స్కూల్ బ్యాగులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో యూనిఫామ్ ఇవ్వకపోవడంతో పిల్లలు పాత, చినిగిపోయిన దుస్తులు వేసుకుంటున్నారని తెలిపారు. పదేండ్లలో అద్భుతంగా నడిచిన గురుకులాల వ్యవస్థ, రేవంత్ పాలనలో కుదేలవుతుండటం దురదృష్టకరమన్నారు. దిగజారుతున్న గురుకులాల ఖ్యాతిని నిలబెట్టాలని, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద పిల్లల భవిష్యత్తును కాపాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు బకాయిలు వెంటనే చెల్లించాలని తెలిపారు. ఆహార పదార్థాలు, ఇతర సామాగ్రి సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగులు.. తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు

# సార్క్‌కు పోటీగా చైనా-పాక్ కొత్త కూటమి ఎత్తుగడ.. ఖండించిన బంగ్లాదేశ్

ఈ కొత్త కూటమిలోకి ఆహ్వానించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. వాణిజ్యం, దేశాల మధ్య అనుసంధానం పెంచుకోవడం ద్వారా ప్రాంతీయ సంబంధాలను బలోపేతం చేయాలన్నది ఈ కొత్త గ్రూపు ప్రధాన ఉద్దేశమని ఆ పత్రిక పేర్కొంది.

### కొట్టిపారేసిన బంగ్లాదేశ్



బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ ప్రచారాన్ని ఖండించింది. చైనాలో జరిగింది రాజకీయ సమావేశం కాదని, ఎలాంటి కొత్త కూటమిని ఏర్పాటు చేయడం లేదని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం. తౌఫిద్ హొస్సైన్ మాట్లాడుతూ, "మేము ఏ కొత్త కూటమిని ఏర్పాటు చేయడం లేదు" అని తేల్చిచెప్పారు. దీంతో ఈ వ్యవహారంపై మరింత ఆసక్తి పెరిగింది. మరోవైపు, ఈ కొత్త గ్రూప్‌లోకి భారత్‌ను కూడా ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భారత్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక సభ్యదేశాలుగా ఉన్న సార్క్ కూటమి గత కొన్నేళ్లుగా అచేతనంగా మారింది. 2016లో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ శిఖరాగ్ర సమావేశం యూరీలో ఉగ్రదాడి కారణంగా రద్దయింది. ఆ దాడి నేపథ్యంలో సదస్సులో పాల్గొనేందుకు భారత్ నిరాకరించింది. ఆ తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్‌లు కూడా భారత్‌కు మద్దతుగా సదస్సును బహిష్కరించాయి. అప్పటి నుంచి సార్క్ సమావేశాలు జరగలేదు.

# జనవరి 1 నుంచి క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు

మొదటి పేజి తరువాయి



క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి వచ్చిన టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీకి అభినందనలు తెలిపారు. తాను తొలిసారి సీఎం అయినప్పుడు ఐటీ పరిశ్రమ విస్తరిస్తోందని, ఆ సమయంలో బిల్ గేట్స్‌ను కలిసి ఐటీ విస్తరణ గురించి చర్చించానని గుర్తు చేసుకున్నారు. పీపీపీ మోడల్‌లో హైటెక్ సిటీ కట్టాలని ఎల్అండ్‌టీని కోరానని, తర్వాత బెంగళూరు, గుర్గామ్‌లోనూ ఐటీ భవనాలు కట్టిందని పేర్కొన్నారు.

### జనవరి 1 నుంచి క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు: సీఎం చంద్రబాబు

భవిష్యత్తులో ఐటీకి అతిపెద్ద హబ్‌గా భారత్ మారుతుందని ఆనాడే చెప్పానన్న చంద్రబాబు, మ్యాథ్స్‌లో నిపుణులైన యువత మనకు ఉన్నారని తెలిపారు. తర్వాత ఇంజినీరింగ్ కళాశాలలు అనేకం వచ్చేలా చూశామని వెల్లడించారు. ప్రపంచంలో అత్యధికంగా సంపాదించేది భారతీయులేనని, అమెరికా సిలికాన్ వ్యాలీని ఆదర్శంగా తీసుకొని క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టామని గుర్తు చేసుకున్నారు. ఐటీ వృద్ధి చెందితే లాభం ఏంటని ప్రజలు ఆలోచిస్తున్నారని, భవిష్యత్తులో ప్రతీది ఐటీతో ముడిపడి ఉంటుందని అన్నారు. ఐటీ వృద్ధి చెందితేనే మనం అభివృద్ధి చెందగలమని చెప్పారు. జనవరి 1 నుంచి కార్యకలాపాలు: జనవరి 1 నుంచి అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు కొనసాగుతాయని సీఎం చంద్రబాబు తెలిపారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఎలాగో, అమరావతికి క్వాంటం వ్యాలీ అలాగని స్పష్టం చేశారు. క్వాంటం శాటిలైట్ ఆవిష్కరణలతో సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేసేందుకు తాను ముందుంటానని హామీ ఇచ్చారు. మన రాష్ట్రానికి ప్రధాని మోదీ పూర్తి సహకారం ఉందన్న సీఎం, ప్రపంచానికి మేలు జరిగేందుకు భారత్-అమెరికా కలిసి పనిచేయాలని కోరారు. క్వాంటంను ఐటీ మంత్రి లోకేష్ మరింత ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సెల్‌ఫోన్ అనేది ప్రతిఒక్కరి ఆయుధం: గతంలో తాను సెల్‌ఫోన్ గురించి మాట్లాడితే ప్రతిపక్షాలు హేళన చేశారని, సెల్‌ఫోన్ అన్నం పెడుతుందా అని తనను ప్రశ్నించేవారని తెలిపారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ అనేది ప్రతిఒక్కరి ఆయుధమని, సెల్‌ఫోన్ ద్వారానే అన్ని పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం దేశానికి యువ జనాభా ఉపయోగకరంగా మారిందన్న చంద్రబాబు, జనాభాను సక్రమంగా వినియోగించుకుంటే అభివృద్ధిలో దేశం అగ్రస్థానానికి చేరుతుందని స్పష్టం చేశారు. అంతరిక్షరంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని కోరామని, డిఫెన్స్, స్పేస్-టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ రంగాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. ఏపీలో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నామన్న చంద్రబాబు, యుద్ధాలకే కాదని పౌరసేవలకు కూడా డ్రోన్లు ఉపయోగ పడుతున్నాయని చెప్పారు. సరైన నాయకుడు దేశాన్ని పరిపాలిస్తున్నారు: గ్రీన్‌ఎనర్జీ రంగానికి ఆంధ్రప్రదేశ్ అనుకూలమని చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ మొత్తం ఏఐ, డీప్‌టెక్నాలజీ రంగాలదే హవా అని, ఏపీలో సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే అందిస్తున్నామని వెల్లడించారు. ఆగస్టు నాటికి 100 శాతం సర్వీసులు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చే అవసరం లేకుండా సర్వీసులు అందిస్తామన్న చంద్రబాబు, చాట్‌జీపీటీ ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా శ్రమ, సమయం తగ్గుతుందని, గతంలో వినియోగదారులుగా ఉండేవాళ్లమని ప్రస్తుతం తయారీదారులుగా మారామన్నారు. సరైన సమయంలో సరైన నాయకుడు దేశాన్ని పరిపాలిస్తున్నారని మోదీని కొనియాడారు. సంపద సృష్టిస్తామని, సృష్టించిన సంపాదనను ప్రజలపై ఖర్చు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆవిష్కరణలకు ఆకాశమే హద్దని అని, అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో ప్రతి ఇంట్లో ఒక ఐటీ నిపుణుడు ఉండాలనేది తన నినాదమన్న చంద్రబాబు, ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఒక ఆవిష్కర్త ఉండాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. ఏవైనా అడ్డంకులు ఉంటే తన దృష్టికి తీసుకురండని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# రాజాసింగ్ రాజీనామా.. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటి పేజి తరువాయి



ఆయనను నిరంకుశంగా అడ్డుకున్నారని పొన్నం ఆరోపించారు. నామినేషన్‌కు మద్దతు తెలిపిన వారిని సైతం భయ భ్రాంతులకు గురిచేయడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన అన్నారు. "ముగ్గురు బీసీ ఎంపీలు, ఎందరో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ, బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడానికి బీజేపీకి మనసొప్పలేదు. గతంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి, కనీసం శాసనసభాపక్ష నేతగా కూడా అవకాశం ఇవ్వలేదు" అని పొన్నం విమర్శించారు. బీజేపీలో బీసీలకు ఎప్పటికీ న్యాయం జరగదని, ఆ పార్టీ నేతలే ఈ విషయంపై వాపోతున్నారని, దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమా ధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు.

రాజా సింగ్ రాజీనామాతో రాజుకున్న వివాదం

సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎమ్మెల్యే రాజా సింగ్ తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అయితే, తన అనుచరులను బెదిరించారని, నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఆయన పార్టీకి తన రాజీనామాను ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఆ పార్టీలోని కొందరు పెద్దలకే ఇష్టం లేదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

### సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ పార్టీలో ముఖ్యమంత్రి రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి అయితే, పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు. "మేము కుల గణన చేపట్టి, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేశాం. కానీ బీజేపీ మాత్రం బీసీల గొంతు కోస్తోంది" అని ఆయన విమర్శించారు. గతంలో బీసీ నేత బండి సంజయ్‌ను కీలకమైన ఎన్నికల సమయంలో అధ్యక్ష పదవి నుంచి తొలగించిన విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల పక్షాన నిలుస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఇరాన్‌కు 30 బిలియన్ డాలర్ల ఆఫర్: స్పందించిన డొనాల్డ్ ట్రంప్

డెమొక్రాట్ సెనెటర్ క్రిస్ కూన్స్‌కు ఈ విషయం స్పష్టంగా చెప్పండి. గతంలో జేసీపీవోఏ ఒప్పందంలా వారికి బిలియన్ల కొద్దీ డాలర్లు ఇచ్చి అణుబాంబు తయారీకి సహకరించేది లేదు. ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేశాక వారితో ఎలాంటి చర్చలూ జరపలేదు" అని ఆయన పేర్కొన్నారు. "30 బిలియన్ డాలర్లు ఇవ్వడం అనే ఆలోచన గురించి నేను ఎప్పుడూ వినలేదు" అని తేల్చి చెప్పారు. ప్రముఖ వార్తా సంస్థ సీఎన్ఎన్ కథనం ప్రకారం, పౌర అవసరాల కోసం అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ఇరాన్ అంగీకరిస్తే, అమెరికా ప్రభుత్వం 30 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొంది. దీనితో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు తెలిపింది. ఈ వార్తలపై ట్రంప్ స్పందించారు. మరోవైపు, అమెరికాతో చర్చలు పునఃప్రారంభం కావాలంటే భవిష్యత్తులో తమపై ఎలాంటి దాడులు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. చర్చల కోసం ట్రంప్ కార్యవర్గం మధ్యవర్తుల ద్వారా తమకు సందేశాలు పంపుతోందని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మాజిద్ తక్త్ రావంచి బీబీసీకి వెల్లడించారు.

# దక్షిణాసియా క్వాంటం కేంద్రంగా అమరావతి

మొదటి పేజి తరువాయి

ఈ వర్క్?షాష్?న?కు ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇందులో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులకు హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. క్వాంటం టెక్నాలజీకి ప్రపంచ కేంద్రంగా అమరావతిని మార్చేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. అందరం కలిసికట్టుగా భవిష్యత్?ను రూపొందిద్దామని లోకేశ్ పిలుపునిచ్చారు. "చంద్రబాబు మొదటి చాప్టర్ ప్రారంభించినప్పుడు నేను ఏడో తరగతి. అప్పుడు ఐటీలో ఏం చేస్తున్నారనేది నాకు అర్థం కాలేదు. సాంతికేత విప్లవంలో చంద్రబాబు రెండో చాప్టర్ చూడబోతున్నందుకు నేను చాలా అదృష్టవంతుడిని. ఆయన మొదటిసారి క్వాంటం టెక్నాలజీ గురించి చెప్పినప్పుడు చుట్టూ ఉన్నవారిలో 99శాతం మందికి అదేంటో అర్థం కాలేదు. స్టాన్?ఫోర్డ్‌లో ఎంబీఏ చేసి ప్రపంచబ్యాంకులో పనిచేసిన నాకు కూడా అదేదో పజిల్ అనిపించింది. మేమంతా చాట్ జీపీటీకి వెళ్లి వెతికాం. దార్శనిక నాయకుడి సారథ్యంలో పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంది." – లోకేశ్, ఐటీ శాఖ మంత్రి సాంకేతికతకు పెద్దపీట : రాజధానికి అనేక ఐటీ సంస్థలు వస్తున్నట్లు లోకేశ్ వివరించారు. అధునాతన సాంకేతిక కేంద్రంగా అమరావతిని మారుస్తామన్నారు. క్వాంటం టెక్నాలజీపై మరింత దృష్టి పెడుతున్నామని తెలిపారు. అమరావతికి రావాలని స్టార్టప్ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు విజనరీ లీడర్‌షిప్ గురించి అందరికీ తెలుసని ఆయన ఎప్పుడూ సాంకేతికతకు పెద్దపీట వేస్తారని లోకేశ్ వెల్లడించారు. 'చంద్రబాబు తదుపరి వర్షన్‌ను దేశం చూడబోతోంది. ఆ చరిత్రకు మేమూ సాక్ష్యంగా నిలవబోతున్నాం. తగిన మానవ వనరులు లేకుండా భవిష్యత్‌లో క్వాంటం టెక్నాలజీ విస్తరణ సాధ్యం కాదు. అందుకే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని సిలబస్ ప్రవేశపెట్టబోతున్నామని చెప్పడానికి గర్విస్తున్నాను. ఇది ఏపీని క్వాంటం టెక్నాలజీకి మేథోకేంద్రంగా మారుస్తుంది. అమరావతి నాల్డెజ్? సిటీలో క్వాంటం పరిశోధనా జోన్‌ను అభివృద్ధి చేస్తాం. ఎల్?అండ్?టీ, ఐబీఎం, డీఆర్‌డీఓ సహకారంతో క్వాంటం స్టార్టప్‌లు, ల్యాబ్స్,విదేశీ పరిశోధనాకేంద్రాలు, ప్లగ్?అండ్?ప్లే పరిశోధనా కేంద్రాలకు ఏకగవాక్ష విధానంలో అనుమతులిస్తాం' అని లోకేశ్ వ్యాఖ్యానించారు.



# బంకర్ బస్టర్ల దిశగా..భారత్ అడుగులు

మొదటి పేజి తరువాయి



ఇటీవలి ప్రపంచ సంఘర్షణల నుంచి పాఠాలు నేర్చుకుంటూ.. భారత్ సైతం బంకర్ బస్టర్ క్షిపణుల తయారీకి ముందడుగు వేస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. బంకర్-బస్టర్ సామర్థ్యాలను అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం తన ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపాయి. భూగర్భ లక్ష్యాలను ఛేదించగల శక్తివంతమైన కొత్త క్షిపణి వ్యవస్థను నిర్మించడం ద్వారా భారత్ భవిష్యత్ యుద్ధాలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సంస్కరణను అభివృద్ధి చేస్తోంది. ఇది 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధిని కలిగి ఉంటుంది. అయితే ప్రస్తుతం రూపొందించనున్న కొత్త వేరియంట్ 7500 కిలోగ్రాముల భారీ బంకర్-బస్టర్ వార్‌హెడ్‌ను మోయగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ క్షిపణి పేలడానికి ముందు 80 నుంచి 100 మీటర్ల భూగర్భంలోకి చొచ్చుకుపోగలదని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల అమెరికా ఇరాన్‌పై 'జీబీయూ-57 ఏ/బీ' అనే ఆరు భారీ ఆర్డినెన్స్ పెనట్రేటర్ బాంబులు ప్రయోగించింది. ఈ బాంబులు ఒక్కొక్కటి 13,600 కిలోల బరువుంటాయి. భూమిలోకి ముందుగా 61 మీటర్ల మేర చొచ్చుకెళ్లి.. ఆపై ఇవి పేలుతాయి. ఒకేచోట ఒకదాని వెంట ఒకటిగా ఈ బాంబులను జారవిడిస్తే.. చాలా లోతుగా నష్టం కలిగించవచ్చు. వీటిలో సంప్రదాయ వార్‌హెడ్‌లే ఉంటాయి. ఒక్కో బాంబు ఖరీదు 20 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఈ బాంబులకు దీటుగా భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో బంకర్ బస్టర్లను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. వీటిని మోసుకెళ్లడం కోసం కోసం విమానాలపై ఆధారపడడానికి బదులుగా బంకర్ బస్టర్‌ను 'క్షిపణి-బట్టర్'గా రూపొందించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగా రెండు అగ్ని-5 నూతన రకాలను అభివృద్ధి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వీటిలో ఒకటి భూమిపై ఉన్న లక్ష్యాల కోసం రూపొందిస్తుండగా..మరొకటి భూగర్భంలోని లక్ష్యాలను ఛేదించగలిగేదిగా ఉండనుంది. పాకిస్థాన్, చైనా వంటి శత్రు దేశాలలోని కమాండ్-అండ్-కంట్రోల్ కేంద్రాలు, భూగర్భ క్షిపణి, సైనిక స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. వీటిని హైపర్‌సోనిక్ ఆయుధాలుగా వర్గీకరిస్తారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలు



ఆమనగల్లు,జూన్ 30(నేటి శుభోదయ):ఆమనగల్లు మున్సిపాలిటీలో అచ్చంపేట మాజీ శాసనసభ్యులు, నాగర్ కర్నూల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డా.గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డా. పత్య నాయక్ పాల్గొని కేక్ కట్ చేయడం జరిగింది.కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు.అనంతరం పత్య నాయక్ మాట్లాడుతూ అచ్చంపేట అభివృద్ధిలో గువ్వల బాలరాజు కృషి మరువలేనిదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్,మాజీ కౌన్సిలర్ వెంకటయ్య,యూత్ వింగ్ అధ్యక్షులు దేరంగుల వెంకటేష్,సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, సాలయ్య,విఠాయిపల్లి రమేష్,సైదులు గౌడ్,పూసల భాస్కర్,చలి చీమల సతీష్, రంజిత్,గణేష్ నాయక్,శ్రీకాంత్ నాయక్,శివ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**టి యు ఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శాంతియుత దీక్షలు.**

**ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి**

**తెలంగాణ ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు.**



చేవేళ్ల (నేటి శుభోదయ): కాంగ్రెస్ పార్టీ ఎన్ని కలకు ముందు అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోనికి వచ్చిన తరువాత హామీని తుంగలో తొక్కడం చాలా బాధాకర మని తెలంగాణ ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు, అన్నారు. సోమవారం శంకపల్లి, మొయినాబాద్ ,శాంతియుత దీక్షలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టారని చెప్పారు.అధికారం లోనికి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఉద్యమ కారుకులకు ఇచ్చిన హామీని అమలు చేయక పోవడం ఉద్యమకారులను అవమానపర్చడ మేనని పేర్కొన్నారు. స్థలం వస్తుందనే ఆశతో తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి అధికారంలోకి తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే ఉద్యమకారుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని, మరో ఉద్యమానికి తెరలేపుతా మని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ,మొయినాబాబ్ మండల, అధ్యక్షులు మైపాల్ ,కుమ్మరి రమేష్, ముకుంద రెడ్డి, రాజేందర్, శంకర్ పల్లి మండల అధ్యక్షుడు అశోక్, పద్మ, ప్రతాపరెడ్డి, పండిత్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు




## విజయవాడలో ఎలక్ట్రిక్ బస్సులు: ఈ రూట్లలో సేవలు అందిస్తాయి



విజయవాడ, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): విజయవాడ నగరంలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ పేర్లతో ఎలక్ట్రిక్ బస్సులు నడవనున్నాయి. ఈ బస్సులు కింది రూట్లలో తిరుగుతాయి కాళేశ్వరరావు మార్కెట్ - ఆటోనగర్- రైల్వేస్టేషన్ - 8ఆటోనగర్హెచ్‌బీ కాలనీ - ఆటోనగర్ హెచ్‌బీ కాలనీ - పెనమలూరు- సిటీ బస్ పోర్టు - మైలవరం సిటీ బస్ పోర్టు - విస్సన్నపేట - కాళేశ్వరరావు మార్కెట్ - పామర్రు ఎన్ఎస్‌బీ నగర్ - ఆటోనగర్- పీఎన్‌బీఎస్ - విస్సన్నపేట జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ - ఆటోనగర్కబేళా - గవర్నమెంట్ ప్రెస్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ - తాడిగడపఈ ఎలక్ట్రిక్ బస్సులు పర్యావరణ హితంగా, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తాయి

## ముఖ్యమంత్రి సహాయనిధితో ఆర్థిక భరోసా

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

33 మందికి రూ.20.51 లక్షల సీఎంఆర్ఎఫ్

చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ మహేష్ కుమార్



ఏలూరు,(నేటి శుభోదయ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 33 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20.51 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శాంతినగర్ లోని క్యాంప్ కార్యాలయంలో ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ తాను ఎంపీగా గెలిచిన ఏడాది కాలంలో రూ.3.50 కోట్లు తమ కార్యాలయం ద్వారా బాధితులకు మంజూరు చేయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించి తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం ద్వారా సేవలు పొందవచ్చని ఎంపీ పేర్కొన్నారు. అత్యవసర సమయంలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక వెసులుబాటు కల్పిస్తుందని ఎంపీ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సమర్ధవంతంగా పనిచేస్తుందని ఎంపీ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తున్నట్లు ఎంపీ వెల్లడించారు.





# రాంచందర్‌రావు కు పగ్గాలు వెనుక

### ఈటలకు పదవి అడ్డుకుందెవరు..!?



హైదరాబాద్,(నేటి శుభోదయ): తెలంగాణ బీజేపీ కొత్త చీఫ్ ఖరారయ్యారు. అనూహ్యంగా రాంచందర్‌రావు ను పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేసారు. తొలి నుంచి పలువురు పేర్లు రేసులోకి వచ్చాయి. తెలంగాణలో పార్టీ భవిష్యత్ పైన అధినాయకత్వం భారీ అంచనాలతో ఉంది. ఈ సమయంలో వ్యూహాత్మక నిర్ణయాలు అమలు చేస్తోంది. అదే సమయంలో రాంచందర్‌రావు ఎంపిక ద్వారా కొత్త సంకేతాలు ఇస్తోంది. అయితే, పార్టీ చీఫ్ గా ఈటల ఖాయమని ప్రచారం వేళ పార్టీ నిర్ణయం ఆసక్తి కరంగా మారింది. దీంతో, రాంచందర్‌రావు ఎంపిక వెనుక ఈటల కు రాకపోవటం వెనుక కారణాలు ఏంటనేది ఇప్పుడు పార్టీలో చర్చకు కారణమవుతోంది.

### రాంచందర్‌రావు కు బాధ్యతలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ ఎంపిక వెనుక బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన ఆయనకే సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు ప్రకటించారు. పార్టీ సైద్ధాంతిక నేపథ్యం పట్ల సంపూర్ణ అవగాహన ఉన్నవారికే అధ్యక్ష పీఠం కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే రాంచందర్‌రావు ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, బీజేపీ యువ మోర్చా, పార్టీలో వివిధ హోదాల్లో రాంచందర్‌రావు పని చేసారు. పార్టీ ఇబ్బందుల్లో ఉన్న అనేక సందర్భాల్లో రాంచందర్‌రావు మద్దతుగా నిలిచారు. పార్టీలోని అందరి నేతలతోనూ సత్సంబంధా లు కలిగిన నేతగా గుర్తింపు ఉంది.

### బీసీ సమీకరణం

మరోవైపు, పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ పేరు కూడా రాష్ట్ర అధ్యక్షుడి తుది జాబితాలో ఉంది. బీసీ ఎంపీనే కొత్త అధ్యక్షుడు అవుతారన్న ప్రచారం ఒకవైపు సాగుతుండగా, మరోవైపు జాతీయ స్థాయి సమీకరణాల నేపథ్యంలో ఇతర సామాజిక వర్గానికి అధ్యక్ష కిరీటం దక్కవచ్చన్న ప్రచారం కూడా ఉంది. తాము అధికారంలోకి వస్తే బీసీనే సీఎం చేస్తామని పార్టీ నాయకత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడిగా మరో సామాజిక వర్గం నేత ఉండాలన్న ఆలోచనలో భాగంగా పార్టీకి సుదీర్ఘ కాలం సేవలు అందిస్తున్న రాంచందర్‌రావు కు అవకాశం ఇచ్చారు. దీని ద్వారా పార్టీని నమ్ముకున్న వారికి మంచి అవకాశాలు వస్తాయనే సంకేతాలను పార్టీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు అధ్యక్ష పదవి ఏకగ్రీవం కానుంది.

### ఈటలకు నో ఛాన్స్

ఇక, బీసీకి పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఈటల రాజేందర్ కు ఇస్తారని ప్రచారం సాగింది. ఒక దశలో ఈటల పేరు ఖాయమైనట్లు ఢిల్లీ సర్కిల్స్ లో వినబడింది. బండి సంజయ్ ను కేంద్ర మంత్రి చేయటంతో ఈటల కు లైన్ క్లియర్ అయిందని భావించారు. కాగా, గతంలో సంజయ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చోటు చేసుకున్న పరిణామాలు ఆ సమయంలో ఈటల ఢిల్లీకి ఫిర్యాదుల వ్యవహారం ఇప్పుడు ప్రభావం చూపినట్లు చర్చ జరుగుతోంది. పార్టీలోకి వచ్చిన వారి కంటే పార్టీనే నమ్ముకున్న వారికి పదవులు ఇవ్వాలనేది పార్టీ నిర్ణయంగా చెబుతున్నారు. కాగా, తెలంగాణ బీజేపీ లో నడిచిన కోల్డ వార్ ఢిల్లీ నివేదికలు ముఖ్య నేతల అభిప్రాయాలతో ఇప్పుడు కొత్త వివాదాలకు తావు లేకుండా రాంచందర్‌రావు పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

# మంత్రి సీతక్క ప్రజల్లో పట్టు కోల్పోతుందా?

హైదరాబాద్, వరంగల్,(నేటి శుభోదయ): ప్రతిపక్ష నాయకురాలిగా ప్రజల గొంతుకై ప్రశ్నించింది, తనను నమ్ముకున్న ప్రజల సంతోషాల్లో కష్టాల్లో భాగస్వామ్యం అయింది, ప్రజల పట్ల తనకున్న అభిమానం విలక్షణమైన తన సేవ గుణం దేశంలోనే ఒక గొప్ప నాయకురాలుగా పేరు సంపాదించుకుంది. కానీ అధికార పార్టీ మంత్రిగా ఉన్న తనకి తన పార్టీ నాయకుల వ్యవహార శైలితో రోజురోజుకీ ప్రజల్లో పట్టుకోల్పోతుందా అనిపిస్తుంది ఇంతకీ ఎవరు ఆ నాయకురాలు ఏంటా కథా సీతక్క ఓ నమ్మకం, కష్టాలో ఆమె ఓ సహాయం, ఆపదలో ఉన్న వారికి ఆమె భరోసా, ప్రజా నాయకురాలిగా అలుపెరుగని పోరాటం, ప్రజాసేవలో అలసిపోని మానవత్వం కలిగిన అరుదైన వ్యక్తిత్వం సితక్క, ఆలాంటి నాయకురాలు కోటికొక్కరుంటారు. కానీ అధికార పార్టీ మంత్రిగా ఉన్న తనకి ఒకప్పుడు జేజేలు పలికినవారు నేడు ఆమెకి దూరం అవుతున్నారు. ఒకప్పుడు ఎంత బిజీగా ఉన్నా, ప్రజల కష్టాలలో ఓదార్చి వారి తరుపున మాట్లాడి వ్యక్తి, నేడు రాష్ట్ర మంత్రిగా, మరో జిల్లా ఇంచార్జ్ మంత్రిగా బిజీ గా ఉండటంతో నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఎందుకు సీతక్క లాంటి నాయకురాలు ప్రజల నుండి దూరం అవుతున్నారు, ప్రజలు సీతక్క గురించి ఏమను కుంటున్నారో తన దృష్టికి వెళ్తుందా లేదా ములుగు జిల్లా నాయకులు మంత్రి సీతక్క ను మై మరిపిస్తున్నారా..? కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతక్క మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ములుగు లోని ప్రజలు ఎంతో సంతోషించారు ప్రజల భవిష్యత్తు బాగుంటుందని ఎన్నో కలలు కన్నారు. కానీ వారు కన్న కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి. సీతక్క లాంటి డైనమిక్ లీడర్ తన నియోజకవర్గంలో జరుగుతున్న అధికార పార్టీ నాయకుల ఆగడాలు తనకు తెలిసి జరుగుతున్నాయా తెలియక జరుగుతున్నాయా అయోమయంలో నియోజకవర్గ ప్రజలు. గల్లీ లీడర్ నుంచి జిల్లా లీడర్ వరకు సెటిల్మెంట్ల దందా, ఇసుక దందా లో అధికార పార్టీ నాయకుల చేతివాటం పై అనేక ఆరోపణలు, అర్హులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ నాయకుల అక్రమ దందాకు అసలైన లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలు ఎవరైనా నిలదీస్తే వారిని టార్గెట్ చేసి కేసులు పెడుతూ దాడులు చేస్తామని బెదిరిస్తున్న అధికార పార్టీ నాయకులు.



దీంతో ఒకప్పుడు జేజేలు కొట్టిన వారే ఇప్పుడు అసహ్యించుకుంటున్నారు.ములుగు నియోజకవర్గ అధికార పార్టీ నాయకుల వ్యవహార శైలి తో సీతక్క గెలుపు కోసం ఏమీ ఆశించకుండా పనిచేసిన ఎందరో అభిమానుల మనసులో వున్న అభిమానం తొలగిపోతుంది. ఒక మండలంలోని గ్రామ అధ్యక్షుడు ఇందిరమ్మ ఇళ్లలో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన మంత్రి సీతక్క మండల నాయకుల నుండి జిల్లా నాయకులు వరకు చేస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదు సరికదా వారి ఆగడాలకు అడ్డు కట్ట వేయక పోవటంతో రెచ్చిపోతూ వి డోంట్ కేర్ ఎనీ వన్ అన్ని విర్ర విగుతున్నారు. అధికారమనేది ఎవరికి శాశ్వతం కాదు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని మంచి సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు చేసే అభివృద్ధి పనులు స్థిర స్థాయిగా ప్రజల మనసులో నిలిచిపోవాలి. ఆ విధంగా ప్రజల మన్ననలు పొందాలి. అధికారం ఉందనే పొగరుతో పోలీసుల సహాయంతో కోర్టు గొడవలు,భూ పంచాయతీలు, బలవంతపు సెటిల్మెంట్, అవినీతి అక్రమాలు, పేకాట దందాలు, ఇసుక దందా, కాంట్రాక్టర్ల దందా లకు కేరాఫ్ అడ్రస్ గా ములుగు కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహార శైలి ఉంది అని ప్రజలు గుసగుస లాడుతున్నారు. ఓ సీనియర్ నాయకుడు జిల్లాలో భారీగా పేకాట శిబిరాలు నిర్వహిస్తూ పలుమార్లు పేకాట ఆడుతూ పోలీసులకు దొరికిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి ప్రాణం పోయినా పేకాట ఆపను అని బహిరంగనే చెప్తున్నా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో ఎలాంటి హోదా లేకపోయినా హడావుడి చేస్తున్న ఎందుకు సీతక్క అతనిపై చర్యలు తీసుకోవటం లేదు. నైతిక విలువలకు మారుపేరుగా ఉన్న సీతక్క అధికార మత్తులో విలువలు విశ్వసనీయతను పక్కకు పెట్టేసిందా అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. సీతక్క అంటే ఒక అంకితభావం,క్రమశిక్షణ, పట్టుదల కలిగిన గొప్ప నాయకురాలు తన జీవితం లో ఎన్నో కష్టాలు ఎదుర్కొని, తన 20 సంవత్సరాల పైగా రాజకీయ జీవితంలో ప్రజా సేవ లలో తనకంటూ ప్రజల్లో గొప్ప అభిమానం సంపాదించుకున్న నాయకురాలు సీతక్క ఇప్పటికైనా సీతక్క తన వ్యక్తిత్వానికి మచ్చ తీసుకువస్తున్న వారిని కంట్రోల్ చేయాల్సిన అవసర ఎంతైనా ఉంది. అధికార పార్టీ నాయకులను అధికార అహంకారం నుంచి ప్రజాసేవ వైపు మళ్లించాలి ప్రజలు కోరుతున్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పేకాట,సెటిల్మెంట్లు, అక్రమ దందాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకొనీ అధికార పార్టీ మంత్రిగా తనని నమ్ముకున్న ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

## ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ పోస్టులను భర్తీ చేయాలి....

**షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ అందుబాటులో ఉంచాలి..**

**థైరాయిడ్ మెడిసిన్ కొరత నివారించాలి..**

**హాస్పటల్ పరిశుభ్రతకు శానిటేషన్ వర్కర్స్ ను పెంచాలి..**

**ఐద్వా జిల్లా అధ్యక్షులు డి సీతాలక్ష్మి..**

**అఖిల భారత మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్ సమస్యలపై సర్వే....**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం ప్రతినిధి, జూన్ 30, (నేటి శుభోదయ): భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు డి సీతాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు సమస్యలపై ఐద్వా బృందం సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఇంకా 23 మంది వైద్యులు 40 మంది నర్సింగ్ స్టాఫ్ అవసరం ఉందని సర్వే బృందం దృష్టికి వచ్చినట్లు తెలిపారు. 200 పడకల ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్స్ కేవలం 40 మంది ఉన్నారని మరో 40 మంది అవసరం ఉందని తక్షణ మే శానిటేషన్ వర్కర్స్ ని నియమించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. వైద్య సేవలో రోగులకు కావలసిన మెడిసిన్స్ అందుబాటులో లేవని ప్రధానంగా షుగర్ పేషెంట్స్ కు ఇన్సులిన్, థైరాయిడ్ పేషెంట్లకు మెడిసిన్స్ కొరత తీవ్రంగా ఉందని వెంటనే వాటిని తెప్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. డెలివరీ వార్డులో ఆపరేషన్ చేసిన డెలివరీ పేషెంట్ వద్ద పిల్లలకు ప్రత్యేక ఊయల గాని బెడ్ గాని లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలో వచ్చిన సమస్యలపై సూపరిండెండెంట్ డాక్టర్ రామకృష్ణను వివరణ కోరగా వైద్యులు కొరత ఉందని పేర్కొన్నారని తెలిపారు. ఏరియా హాస్పిటల్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆమె తెలిపారు. ఈ సర్వే కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు నాదెళ్ల లీలావతి ఐద్వార్ జిల్లా కమిటీ సభ్యులు జీవనజ్యోతి పట్టణ ఆఫీస్ బ్యారేర్స్ సుబ్బలక్ష్మి,సక్కుబాయి,నాగలక్ష్మి రాధా,తదితరులు పాల్గొన్నారు..

## గిరిజన మహిళలు స్వసక్తితో జీవనోపాధి పెంపొందించు కోవాలి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం,జూన్ 30, (నేటి శుభోదయ): ఆదివాసి గిరిజన మహిళలు ఇంటిపట్టునే ఖాళీగా ఉండకుండా స్వసక్తితో జీవనాధారం పెంపొందించు కోవడానికి చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని ఇంటికి అవసరమైన వస్తువులు తయారు చేసి వాటిని అమ్మకాలు జరిపి వారి కుటుంబాన్ని పోషించుకోవడమే కాక పది మందికి ఉపాధి కల్పిస్తున్న మహిళలకు ప్రతి ఒక్కరూ చేయూతని అందించాలని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం లోని గిరిజన దర్బార్ కు గిరిజనుల సమస్యలపై ప్రాజెక్టు అధికారి తో చర్చించిన అనంతరం ఎం ఎస్ ఎం ఈ యూనిట్ ద్వారా చిన్న తరహా పరిశ్రమల ద్వారా న్యూట్రిషన్ పదార్థాలు అమ్మకాలు జరిపే స్టాల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి మహిళలు వారే సొంతంగా తయారుచేసిన ఆరు రకాల సబ్బులు షాంపూలు, మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డు, ఇతర రకాల పచ్చళ్ళు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సరసమైన ధరలకు అమ్మకాలు జరుపుకోవడానికి అవకాశం ఇచ్చి గిరిజన మహిళలకు ఉపాధి కల్పించడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు. వారు తయారు చేసిన వస్తువులు ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి వారి జీవన భృతికి తోడ్పాటు అందించాలని అన్నారు. వారు తయారు చేసే సబ్బులు షాంపూలు వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన వనమూలికలు కలిపి శరీరానికి ఎటువంటి రుగ్మతలు రాకుండా అన్ని పదార్థాలు సమపాలల్లో కలిపి తయారు చేస్తారని అటువంటి ఔషధ గుణాలు కలిగిన వస్తువులు ఇంటిల్లిపాది వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. భద్రాద్రి శ్రీరామ జాయింట్ లీయబిలిటీ మహిళా గ్రూపు సభ్యులు మరియు శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లియాబిలిటీ మహిళా గ్రూప్ సభ్యులు రాగి, సజ్జలు, కొర్రలు మరియు ఇతర న్యూట్రిషన్ పదార్థాలతో తయారు చేసే మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డూలు, మునగ, కరివేపాకు కారంపొడి, మామిడికాయ, గోంగూర పచ్చళ్ళు అమ్మకాలు జరుపు కుంటున్నారని, గిరిజన దర్బార్కు వచ్చే గిరిజనులు కొనుగోలు చేసి వారికి చేయూత అందించాలని అన్నారు. అనంతరం వారు తయారు చేసిన సబ్బులు షాంపూలు ఇతర వస్తువులు, మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపు లడ్డు ఆయన కొనుగోలు చేసి ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే నిరుపేదలైన గిరిజనులకు సరసమైన ధరలకు మీరు తయారు చేసిన వస్తువులు అందించాలని గ్రూప్ మహిళలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ మహిళలు విజయలక్ష్మి, సమ్మక్క, సున్నం ఈశ్వరి,సున్నం స్వాతి, బేబీ రాణి, జగ్గా కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో నిరంతరం కరెంటు కోతలు

## బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డా. పత్య నాయక్



ఆమనగల్లు,జూన్ 30(నేటి శుభోదయ): ఆమనగల్లు మండలం మరియు మున్సిపాలిటీలో నిరంతరం విద్యుత్ సరఫరాలో కరెంట్ కోతలతో రైతులను,వ్యాపారస్థులను ఇటూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నీటి సమస్య మరియు కరెంటు కోతలు ఉండవని నమ్మిస్తూ ఇప్పుడు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.గత 10సం,,ల కెసిఆర్ హయాంలో లేని కరెంటు కోతలు ఇప్పుడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు కరెంటు పోతుందని ఈ సమస్య ఇలాగే కొనసాగితే రైతులు,వ్యాపారస్తులు,ప్రజల తరపున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున కార్యాలయాన్ని ముట్టడిస్తామని బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డా. పత్య నాయక్ హెచ్చరిస్తూ కరెంట్ సబ్ ఇంజనీర్ గిరిబాబుకు మెమోరండం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీను నాయక్,వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క అల్లాజీ గౌడ్,మాజీ కౌన్సిలర్ వెంకటయ్య,యూత్ అధ్యక్షులు దేరంగుల వెంకటేష్,సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి,సైదులు గౌడ్,రమేష్ నాయక్,గణేష్ నాయక్,శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం ప్రతినిధి, జూన్ 30, (నేటి శుభోదయ): భద్రాచలం మండలం, వెంకటేశ్వర కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాదె మాధవ రెడ్డి మరియు మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

# బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణం ఆపేయండి



దమ్మపేట ప్రతి నిధి **(నేటి శుభోదయ):** జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలకు వినతి పత్రం అందించిన దమ్మపేట గ్రామ పెద్దలు దమ్మపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపడుతున్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని గ్రామ పెద్దలు సోమవారం ప్రజావాణిలో జిల్లా అధికారులను కోరారు.బస్టాండ్ ప్రాంతాన్ని కేవలం బస్సుల రాకపోకల కోసమే ఉపయోగించాలని, ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ నిర్మాణం అనవసరమని స్పష్టం చేశారు.ఈ మేరకు గ్రామ పెద్దలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ నిర్మాణం ప్రజారవాణా సౌకర్యార్థమే చేపట్టినదని, అదే ప్రాంతంలో పెట్రోల్ బంక్ నిర్మిస్తే బస్టాండ్ ఉద్దేశం నిర్వర్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పెట్రోల్ బంక్ కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని, ప్రజల ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. త్వరితగతిన చర్యలు తీసుకుని బస్టాండ్ నాశనం కాకుండా చూడాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# "భారాస నేత జగదీష్ రెడ్డి ఒక ఖల్ నాయక్"



కోదాడ , **(నేటి శుభోదయ):** ఒక ఎమ్మెల్యేగా గౌరవ ప్రదంగా వ్యవహారిస్తూ పదిమందికి ఆదర్శంగా ఉండాల్సిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఒక వీధి రౌడీలా మాట్లాడటం తగదని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు విమర్శించారు. మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై బండ రాళ్ళు, రాడ్లు, కర్రలతో దాడి చేసి, పైగా అది దాడి కాదు నిరసన అని నిసిగ్గుగా చెప్పటం జగదీష్ రెడ్డికే చెల్లుబాటు అవుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ పార్టీ కూడా ఒక న్యూస్ ఛానెల్, దినపత్రికను నడుపుతూ మరో న్యూస్ ఛానెల్ పై దాడికి తెగబడ్డారంటేనే వీళ్ళు నాయకులు కాదు ఖల్ నాయకులు అని రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమైందని చెప్పారు. ఇంతటితో ఐపోలే ఇంకా మూడు ఎల్లో ఛానల్స్ పని కూడా పడతామని చెప్పడం, చంద్రబాబు నాయుడు మీద అవాకులు, చెవాకులు పేలడం జగదీష్ రెడ్డిలో మూర?త్వం, పైశాచికత్వం పరాకాష్టకు చేరినట్లు తేటతెల్ల మౌతున్నదని చెప్పారు. పద్ధతి మార్చుకోకుంటే భవిష్యత్తులో జగదీష్ రెడ్డి రౌడీయిజమే ఆయన పుట్టి ముంచి చరిత్రహీనుణ్ణి చేయడం ఖాయమని చెప్పారు.

# పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులను ఘనంగా సన్మానించిన పోలీస్ కమీషనర్

## శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి

## పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



మంథని/రామగుండం, జూన్-30 (నేటిశుభోదయ): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి సోమవారం పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమములో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్.ఐ కె. వెంకటేశ్వర్ రావు, ఎన్ చంద్రశేఖర్, ఎం. అంజయ్య ఆర్ఐ లను పోలీస్ కమిషనర్ పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించడంతో పాటు, వారికి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.... సుదీర్ఘ కాలం క్లిష్టమైన పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రస్తుతం పదవీవిరమణ చేస్తున్న పోలీస్ అధికారులు వారి పదవీ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవడంతో పాటు, కొన్ని సమయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించి వీరు భవిష్యత్తు తరం పోలీసులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని, ఉద్యోగవిరమణ చేసిన పోలీసు అధికారులు తమ ఆరోగ్యం కోసం నిరంతరం యోగ లేదా వ్యాయామాన్ని కొనసాగించడంతో పాటు, వారి కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని శేష జీవితం కుటుంబ సభ్యులు పిల్లలతో హాయిగా ఆనందోత్సవాలతో జీవితం గడపాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచ లింగం తో పాటు పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారులు హాజరు కావాలి

## ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం,(నేటి శుభోదయ):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతగా భావించి, ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరు కావాలని అన్నారు.







ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిష్కరించాలని, జిల్లా అధికారులు తమ పరిధిలోని సమస్య పరిష్కారం వెంటనే చేయాలని, సమస్య పరిష్కరించలేని పక్షంలో సంబంధిత కారణాలు తెలుపుతూ, దరఖాస్తుదారునికి తెలపాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో మానవీయకోణంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అధికారులు పకడ్బందీగా పాటించాలని అన్నారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులు వారి వారి శాఖ పరిధిలో సమీక్ష చేయాలని, పరిష్కారం నాణ్యతతో చేపట్టాలని, దరఖాస్తుల పరిష్కారం నాణ్యతపై, అదనపు కలెక్టర్ 5 శాతం ప్రజావాణి దరఖాస్తులను క్రాస్ చెక్ చేస్తారని అన్నారు. ప్రతి జిల్లా అధికారి తన పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించి వివరాలు సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే సీఎస్ వీడియో సమావేశాలకు అవసరమైన నోట్స్ సిద్ధం చేసి, ముందస్తుగా సమర్పించాలని అన్నారు.



సోమవారం నాటి ప్రజావాణి లో ఖమ్మం నగరానికి చెందిన వి. మారీష్, ఖమ్మం కలెక్టరేట్ నందు కంప్యూటర్ ఆపరేటర్ గా గతంలో ఎన్నికల సెల్ నందు ఔట్ సోర్సింగ్ లో పని చేశానని, ప్రస్తుతం ఖాళీగా ఉన్నానని, జిల్లా ఆసుపత్రి సదరం క్యాంపు వద్ద ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ పోస్ట్ నందు ఔట్ సోర్సింగ్ ద్వారా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఏఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామ రైతులు శివారు సర్వే నెంబర్ 378, 379 వైపుగా వెళ్లే బండ్ల బాటను కలుపుకొని కంప ఏర్పాటు చేసుకొని కొంత మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, దీంతో తమ భూములకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, బండ్ల బాట యొక్క హద్దులు పునరుద్ధరణ జరిపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామ ప్రజలు తమ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులను ఎంపిక చేశారని, వారిని తొలగించి అర్హులను ఎంపిక చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్డిఓ కల్లూరుకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన అబ్బూరి కౌశిక్ తనకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి అడ్మిషన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్.సి.ఓ. ఎస్.డబ్ల్యు కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కామేపల్లి మండలం అడవి మద్దులపల్లి గ్రామానికి చెందిన నల్లబోలు సుధాకర్ రెడ్డి తనకు 58 శాతం వినికిడి సమస్య ఉన్న పెన్షన్ మంజూరు చేయడం లేదని, దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిపిఎం - చేయూతకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీఓ ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు

## - ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## 22 మంది ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ నేపథ్యంలో నిర్వహించిన పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




**ఖమ్మం,(నేటి శుభోదయ):** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జూన్ నెలలో పదవి విరమణ పొందుతున్న 22 మంది ఉద్యోగుల కోసం సోమవారం ఏర్పాటు చేసిన పదవి విరమణ సన్మాన



కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పదవి విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. మనకు గుర్తింపు ఉద్యోగం నుంచి లభిస్తుందని అన్నారు. పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులు తమ జ్ఞాపకాలను, అనుభవాలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవాలని కలెక్టర్ కోరారు. 30 నుండి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయం అని, జీవితంలో ఒక ముఖ్యమైన భాగం ముగిసి, మరో అంకం ప్రారంభం అవుతుందని అన్నారు. జీవితంలో మనం చేసిన మంచి పనులు శాశ్వతంగా నిలిచి పోతాయని అన్నారు. ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖలలో దశాబ్దాల పాటు సేవలు అందించిన ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని, మిగిలిన జీవితం ఆరోగ్యంతో, ఆనందంతో, ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. పదవి విరమణ పొందుతున్న చింతకాని



తహసిల్దార్ కే. అనంత రాజు మాట్లాడుతూ చైన్ మెన్ గా విధులలో చేరడం జరిగిందని, అంచెలంచెలుగా పదోన్నతి లభించి, తహసీల్దార్ గా పదవీ విరమణ పొందుతున్నట్లు తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో నవ్వుతూ కూర్చోబెట్టి మాట్లాడితే వారి సగం సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. పదవి విరమణ అందుతున్న జిల్లా పౌర సరఫరాల శాఖ లోని డిప్యూటీ తహసిల్దార్ సి.హెచ్.



సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వర పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో రైతుల సంక్షేమం కోసం పకడ్బందీగా పని చేశామని అన్నారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న ఇతర ఉద్యోగులు వారి అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పదవి విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్, పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ

## రైతులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, **(నేటి శుభోదయ):** పామాయిల్, పొగాకు సాగు చేస్తున్న రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు శాంతినగర్ లోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పామాయిల్, పొగాకు రైతులతో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి



సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దెందులూరు నియోజకవర్గం పెదవేగిలోని పామాయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయవద్దని, అలాగే



పామాయిల్ కు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. పొగాకు రైతులు మాట్లాడుతూ ఎన్ఎల్ఎస్ లో పండించే వర్జీనియా పొగాకుకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందని, ఈ పంటపై లక్షలాది మంది రైతులు, కూలీలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గుంటూరు పొగాకు బోర్డు కార్యాలయంలో ఇటీవల జరిగిన పాలకవర్గం సమావేశంలో 49.70 ఎన్ఎల్ఎస్ ప్రాంతానికి 48.6 ఎంకెజిఎస్ పండించుటకు అనుమతించినట్లు తెలిసిందని, తద్వారా బ్యారెన్ ఒకటికి 35 క్వింటాళ్ల మాత్రమే వస్తుందని రైతులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎకరాలు తగ్గిస్తే ఉడికింపు ఖర్చు, ముఠా, కూలీలు తదితర ఖర్చు పెరిగిపోతుందని, బ్యాంకు రుణాల చెల్లింపులు కూడా కష్టమవుతుందని, లైసెన్స్ పై పండే అదనపు పంటకు పెనాల్టీ



లు, లేదా లైసెన్స్ లు తీసుకోవడం ద్వారా తమకు అదనపు ఖర్చు అవుతుందని రైతుల వివరించారు. ఇప్పటికే రైతాంగం 2025 - 2026 పంటకాలానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకున్నందున రైతాంగం కోటా పెంచవలసిందిగా ఎంపీకి విన్నవించారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న ఎన్ఎల్ఎస్ ప్రాంతానికి 58.25 మిలియన్ కేజీలు కోటా ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరారు. సమస్యలు సావధానంగా విన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పామాయిల్, పొగాకు రైతుల సమస్యలను మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి వివరిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు రైతుల సహకరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ డి.వేణు





పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, జూన్ 30 (నేటిశుభోదయ): ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. పెద్దపల్లి మండలం పెద్ద బొంకూరు గ్రామానికి చెందిన రమేష్ తనకు గ్రామ శివారు లో మొత్తం 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, దీనికి పట్టా పుస్తకం సైతం ఉందని, రైతు బంధు పథకం అమలు కావడం లేదని, తనకు రైతు బంధు అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా వ్యవసాయ అధికారికీ రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. రామగుండం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అనూష తమకు అర్హతలు ఉన్నప్పటికీ గృహ జ్యోతి పథకం అమలు కావడంలేదని, గృహ జ్యోతి పథకం అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎస్ఈ విద్యుత్ శాఖ అధికారికీ రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెద్దపెల్లి పట్టణంలోని తాజ్ కాలనీ రోడ్డు కు చెందిన అస్మిత్ జహన్ తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కైకొండాయిగూడెం ఒకటో డివిజన్లో రైల్వే కాలనీలోని అధ్వానంగా బురదమయంగా రోడ్లు

### రోడ్లకు ఇరువైపులా విద్యుత్తు స్తంభాలు ఉండటంతో పచ్చని చెట్లను నరికి వేస్తున్న విద్యుత్తు సిబ్బంది కలెక్టర్ సాబ్ మా మొర ఆలకించండి

ఖమ్మం,(**నేటి శుభోదయ**): రాజులు మారినన రాజ్యాలు మారిన...ప్రజల తలరాతలు మాత్రం మారటం లేదు..కోట్లాది రూపాయల నిధులు రోడ్లకు సైడ్ డ్రైన్లకు అంతర్గత రోడ్లకు సిసి రోడ్లకు ఖమ్మం కార్పొరేషన్ లో కేటాయిస్తున్నప్పటికీ నిధులు విడుదలవుతున్నాయే తప్ప అభివృద్ధి మాత్రం జరగటం లేదనే విమర్శలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. పేరుకు ఖమ్మం పట్టణంలోని కైకొండాయిగూడెం ఒకటో డివిజన్ నెంబర్ వన్ డివిజన్ గా ఉంది. కానీ అభివృద్ధిలో కైకొండాయిగూడెం ఒకటో డివిజన్లోని రైల్వే



కాలనీలో అంతర్గత రోడ్లు సైడ్ రైలు దుస్థితి అద్వానంగా



ఉంది. ఒకపక్క రోడ్ల దుస్థితి ఆ విధంగా ఉంటే రైల్వే కాలనీలోని రోడ్లకు ఇరువైపులా విద్యుత్తు స్తంభాలు ఉండటంతో ఇండ్ల ముందు పచ్చని చెట్లు పెంచుకుంటే కరెంటుకు ఇబ్బంది అవుతుందని షార్ట్ సర్క్యూట్ జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తమ సిబ్బందిని పెట్టి ఇండ్ల ముందు ఉన్న పచ్చని చెట్లను నిర్ధాక్షణంగా నరికి వేస్తున్నారు. ఇరువైపులా ఉన్నటువంటి విద్యుత్తు స్తంభాలను ఒక వైపు మాత్రమే మార్చాలని,అదేవిధంగా ఉన్నటువంటి విద్యుత్తుస్తంభాలు తక్కువ ఎత్తులో ఉండటంతో చిన్న చిన్న చెట్లను కూడా పెంచుకునే పరిస్థితులు లేకుండా వాటి యొక్క ఎత్తును పెంచి వైర్లను పైకి లేపినట్లైతే ఇండ్ల ముందు పచ్చని చెట్లు పెంచుకునే అవకాశం ఉంటుందని, పెంచుకున్న చెట్లను విద్యుత్ అధికారులు నరికి వేస్తుండటంతో ప్రజల ఆరోగ్యాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు తమ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కొన్ని స్తంభాలు రోడ్డుకు అడ్డంగా ఉంటూ నడిరోడ్డు మీద ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు కనీసం వాటిని పరిశీలించకుండా పక్కకు తొలగించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ ఉండటం వలన ఈ ప్రాంతంలో చెట్లు పెంచుకునే అవకాశం లేక ప్రజలు నానా రకాలుగా అనారోగ్యాలకు గురవుతున్నారు. రైల్వే కాలనీలోని ప్రధానంగా ఒకటో నెంబర్ రోడ్డు నుంచి ఐదో నెంబర్ రోడ్డు వరకు



ప్రధానంగా మట్టి రోడ్డుతో ఉండటంతో దురద మయంగా రోడ్ల దుస్థితి మారి వర్షం వస్తే ఆరుబయట కాలు పెట్టాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో ఖాళీ ప్లాట్ లో ఉన్న కొన్నిచోట్ల పరిశుభ్రత చేస్తూ చెట్లను తొలగిస్తున్నప్పటికీ మరికొన్ని చోట్ల ఉన్న ప్లాట్లు చెట్లను తొలగించకపోవడంతో చెట్లు విపరీతంగా పెరిగి అడవిని తలపించే విధంగా ఉండటంతో దురద మయంగా మారి దోమలు, పాములు ,పందులు కుక్కలు విపరీతంగా పెరిగిన చెట్ల వద్ద సంచరించటంతో ప్రజలు నానారకాలుగా భయాందోళనకు గురవుతున్నారు. అనేక మార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు కార్పొరేషన్ అధికారులకు కార్పోరేటర్లకు స్థానిక నాయకులకు ప్రజాప్రతినిధులకు ముఖ్య నాయకులకు తెలియజేసినప్పటికీ పట్టించుకునే నాథుడు లేక ఈ ప్రాంతంలో ప్రజలు రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉండటంతో నాన్న రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం కార్పొరేషన్ ఒకటో డివిజన్ పాలేరు నియోజకవర్గంలో ఉండటంతో స్వయానా రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏరియా కావటంతో ఈ ప్రాంతాన్ని మంత్రిగారు ప్రత్యేక దృష్టి సారించి కైకొండాయిగూడెం ఒకటో డివిజన్ రైల్వే కాలనీలోని రోడ్లను సిసి రోడ్లుగా నిర్మించి ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో ప్రజల యొక్క ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## పిఆర్ టి యు ఏసీ సమావేశ మందిరాన్ని ప్రారంభించిన పింగళి, గుండు, పులగం



ఖమ్మం(**నేటి శుభోదయ**): పి ఆర్ టి యు నూతన కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన ఏసీ సమావేశ మందిరాన్ని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వై వి,) మాజీ అధ్యక్షులు మధు సహకారంతో నిర్మించిన ఈ భవనం మరికొన్ని జిల్లాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని, మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్టియు ఖమ్మం జిల్లా కృషి మరువలేనిదని అందుకు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వై వి) ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సోమవారం ఉద్యోగ వివరణ పొందుతున్న యలమద్ది వెంకటేశ్వర్లు ను జిల్లా సంఘ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు సతీష్ రెడ్డి, జితేందర్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసయ్య, ప్రభాకర్ రావు ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు చలపతిరావు, మోతుకూరి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల ను బాగా ఆకట్టుకున్నాయి.







## ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ ల విడుదలపై 72 గంటల కాలేజీల బంద్ ని విజయవంతం చేయండి

### పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ పిలుపు

చేవేళ్ల నియోజకవర్గం(**నేటి శుభోదయ**): తెలంగాణ రాష్ట్ర కమిటీ పిడిఎస్ యు( ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) పిలుపులోపు భాగంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ ల విడుదలకై 72 గంటల ఇంజనీరింగ్ ,డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కాలేజీల బంద్ ను విజయవంతం చేయాలని సోమవారం నాడు చేవేళ్ల మండల కేంద్రంలో వివేకానంద డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యక్రమం చెప్పటారు ఈ సందర్భంగా పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ , పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జులై 2,3,4 తేదీలలో జరగబోయే 72 గంటల కాలేజీల బంద్ నువ్వు విజయవంతం చేయాలని పేర్కొనడం జరిగింది. 2024- 25 సంవత్సరానికి రావలసిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు సుమారు 7200 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న అరకొరా నిధులు కేటాయించడం తప్ప వాటిని విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇవ్వడంలో విఫలమైందని తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్లు రాక విద్యార్థులు స్వయంగా చెల్లించే స్తోమత లేక, తీవ్రమైన ఇబ్బందికి గురవుతున్నారని అనేకమంది పేద విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీలో ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాసి ర్యాంకులు సంపాదించి





సర్టిఫికెట్లు తమ దగ్గర లేకపోవడంతో ఉన్నత విద్యలకు దూరమవుతున్నారని తెలియజేయడం జరిగింది. ఫైనల్ ఇయర్ పాస్ అయి ఉన్నత విద్య చదువుకోవాలంటే ఫీజు రియంబర్స్మెంట్ రాక ప్రైవేటు యజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక పేద ,బడుగు ,బలహీన వర్గాల విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు. అదేవిదంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని, డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కాలేజీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే ప్రభుత్వ కుట్రను వ్యతిరేకించాలని విద్యార్థులందరూ ఈ జూలై 2,3,4 తేదీలలో జరిగే 72 గంటల కాలేజీల బంద్ లో పాల్గొని విజయవంతం చేయవలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, కళాశాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## విద్యారంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు వైవిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలి

### రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కే లింగయ్య



ఖమ్మం,(**నేటి శుభోదయ**): పిఆర్టియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఎన్ ఎస్ సి కాలనీ ఖమ్మం స్కూల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ వైవి నాకు చిరకాల మిత్రుడని ఉత్తమ ఉపాధ్యాయుడిగా, సమాజ సేవకుడిగా పేరొందారని కొనియాడారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, వాటర్ ప్యూరిఫైయర్లు అందించడంలో విశేష కృషి చేశారని తెలిపారు. కరోనా సమయంలో సమాజంలో కరోనా బారిన పడిన వారి కోసం ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించి, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు అందజేసి సమాజ సేవలో ముందున్నారని తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఖమ్మం నుంచి జమలాపురం వరకు పాదయాత్ర చేసి అన్ని పాఠశాలలకు వెళ్ళి విద్యార్థులకి, పౌరులకి ప్లాస్టిక్ వలన జరిగే అనర్థాలను తెలిపారు. సంఘ బాధ్యుడిగా ఉపాధ్యాయులకు విశిష్టమైన సేవలు అందించారని తెలుపుతూ మిగిలిన జీవితం సమాజ సేవలో ముందుండాలని పాఠశాలలకు ఎప్పుడు తన వంతు సహాయంగా ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, కార్పొరేటర్ పైడిపల్లి సత్యనారాయణ, పూనాటి వెంకటేశ్వర్లు, రాము, రామారావు, నారాయణరావు, యుటిఎఫ్ జిల్లా బాధ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, వీరస్వామి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, పిఆర్టియు జిల్లా మాజీ అధ్యక్షులు ఎం మధు, కెవిఎస్ చలపతిరావు, వేగినాటి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి సోమల నాయక్ పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, బంధువులు మిత్రులు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 30, (నేటి శుభోదయ): పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి ఈ రోజు పదవీ విరమణ పొందిన ఒక ఎస్సై,ఒక ఏఎస్సై మరియు ఒక హెడ్ కానిస్టేబుల్ ను సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజా ఎస్పీ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు. 41 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సై మొహమ్మద్ షఫీని, 36 సంవత్సరాలు తమ సేవల ను అందించి భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన ఏఎస్సై సత్య నారాయణని మరియు అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ సోమవారం పదవి విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ చిన్న వెంకటేశ్వర్లు గార్లు ఈ రోజు పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ ముగ్గురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో మరియు పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ముగ్గురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఏవో మంజ్యా నాయక్ మరియు జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.





## మావోయిస్టులను ఎందుకు చంపుతున్నారు?

### కేంద్రంపై ఎం పి రేణుకా చౌదరి సీరియస్



ఖమ్మం,(**నేటి శుభోదయ**): ఆపరేషన్ కగార్ పై కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం ఆమె ఖమ్మం లో మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలన ఆదర్శంగా నిలిచిందని అన్నారు. రాహుల్ గాంధీ డిమాండ్‌తోనే దేశంలో కేంద్రం కులగణన కు సిద్ధమైందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేసే పనులు చేస్తోందని కొనియాడారు. అనవసరంగా ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తే బీఆర్ఎస్ నేతల తోకలు కట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలు పదేళ్ల అధికారం ఇస్తే రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారని మండిపడ్డారు. బనకచర్ల ద్వారా తెలంగాణ హక్కులు కేసీఆర్ తాకట్టు పెట్టారని విమర్శించారు. అసలు కవిత పార్టీ పెట్టడానికి స్పాన్సర్ ఎవరని ప్రశ్నించారు.

### మావోయిస్టులను ఎందుకు చంపుతున్నారు?

ఆపరేషన్ కగార్‌పైనా రేణుకా చౌదరి హాట్ కామెంట్స్ చేశారు. మావోయిస్టులను కేంద్రం నిర్దాక్షిణ్యంగా చంపుతోందని మండిపడ్డారు. నిర్భయంగా మన దేశంలోకి వచ్చి మన 28 మంది పౌరులను చంపిన ఉగ్రవాదులను పట్టుకోలేదు. వారి కోసం కనీసం గాలించడం కూడా లేదు. మన దేశ పౌరులైన మావోయిస్టులను మాత్రం చంపేస్తున్నారు. కనీసం వారితో చర్చలు కూడా చేయడం లేదని మండిపడ్డారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి...

### చేవెళ్ల నియోజకవర్గం శాసనసభ్యులు కాలే యాదయ్య

### ఘనంగా పోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు



చేవేళ్ల నియోజకవర్గం (**నేటి శుభోదయ**): ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చు కోవాలని భక్తి మార్గంలో నడవాలని గ్రామ దేవతలు అంటే గ్రామాలను కాపాడే దేవతలుగా కొలవబడే ఊరు కట్టుబాట్లు ఆచారాలు ఆచారాలను మన తెలుగు సాంప్రదాయం ఎప్పటికీ మర్చిపోలేదని వారు అన్నారు సోమవారం నాడు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని చంద్రారెడ్డి నగర్ కాలనీలో పోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవేళ్ల పిఎసిఎస్ చైర్మన్ డి వెంకట్ రెడ్డి, ఆగి రెడ్డి, దామరగిద్ద మాజీ సర్పంచ్ గుప్తా, డిసిసి కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయనున్న పీవీఎన్ మాధవ్..



విజయవాడ, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష పదవికి పీవీఎన్ మాధవ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అధ్యక్ష పదవికి సింగిల్ నామినేషన్ వేయాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో మాధవ్ ఎన్నిక లాంఛనమే అంటున్నాయి పార్టీ వర్గాలు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తో ఐదు దశాబ్దాల పైగా మాధవ్ కుటుంబానికి అనుబంధం ఉంది. మాధవ్ ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పనిచేశారు. తండ్రి కొడుకులు ఇద్దరు పార్టీ అధ్యక్షులు అయిన అరుదైన రాజకీయ నేపథ్యం చోటుచేసుకోనున్నది. ఉమ్మడి రాష్ట్రానికి బీజేపీ తొలి అధ్యక్షుడు గా పనిచేసిన మాధవ్ తండ్రి చలపతి రావు పనిచేశారు. ఏపీ బిజెపి రాష్ట్ర కార్యాలయానికి ప్రస్తుత అధ్యక్షురాలు పురంధేశ్వరి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. కర్ణాటక ఎంపీ మోహన్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు.

## విద్యుత్ సరఫరా అంతరాయాన్ని పరిష్కారం చేయండి...



### విద్యుత్ సమస్యపై!ఏ. ఈ!తో చర్చిస్తున్న ఎం.పి.పి, కారం లక్ష్మి....

వి.ఆర్.పురం,జూన్ 30(నేటి శుభోదయ ప్రతినిధి): మండలంలో ప్రతిరోజువిద్యుత్ అంతరాయం ఏర్పడి,మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విషయాన్ని ఎం.పి.పి,కారం లక్ష్మీ, దృష్టికి స్థానిక ప్రజలు తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఎం.పి.పి,కారం లక్ష్మీ, సి.పి.ఎం!పార్టీ మండల నాయకత్వంతోసోమవారం విద్యుత్ శాఖ ఏ.ఈ,(కూనవరం సబ్ స్టేషన్)వారిని మండల ప్రజా పరిషత్ కార్యాలయంకు పిలిపించి ప్రతిరోజు!ఇలా ఏకారణం వలన మండలంలో కరెంటులేకుండా పోతుందని,కరెంట్లేకుండాఉండటం వలన ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని,ఎందుకు ఈ సమస్య తలెత్తుతుందని,ఆరా తీశారు. దీనికి స్పందించిన,విద్యుత్ శాఖఏ. ఈ!మాట్లాడుతూ వి.ఆర్.పురం,మండలానికి ఉన్నటువంటి ఫీడర్ ట్రాన్స్ఫార్మర్ పూర్తిగా కాలిపోవడం వలనఎక్కువ లోడ్పడి ఇబ్బందులు పెడుతుందని,ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, కొత్త ట్రాన్స్ఫారం మంజూరికొరకు ఎస్టిమేట్స్ వేసి పంపామని ,ఒక8రోజులు టైం పడుతుందని అప్పటివరకు కరెంటు ఇబ్బందులు తప్పవని తెలిపారు. అదేవిధంగా!శ్రీరామగిరి, చెరువువద్ద స్థంబాలుపైకి మార్చాలని,అడవివెంకన్నగూడెం గ్రామంలో (వాగులో) ఉన్న స్థంబాలు హైట్ పెంచాలని, విద్యుత్ శాఖ ఏ.ఈ కి తెలపగా!వెంటనే చేపిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.సమావేశంలో సి.పి.ఎం, పార్టీ మండల

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## చేవెళ్ల ఎమ్మెల్యే "కాలే యాదయ్య"



చేవేళ్ల నియోజకవర్గం **(నేటి శుభోదయ):** శంకర్ పల్లి మండలం రావులపల్లి గ్రామంలో రెండుకోట్ల యాభై లక్షలలి నిధులతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు, సంకేపల్లి గ్రామంలో యాభై ఐదు లక్షలలి నిధులతో నూతన సీసీ రోడ్ల



నిర్మాణపనులకు శంకుస్థాపన చేసిన స్థానిక "శాసన సభ్యులు కాలే యాదయ్య ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... నిత్యం చేవెళ్ల నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి కార్యక్రమాల పై ముందుకు వెళ్తామన్నారు. ఈ రోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల నిర్మాణం




యాడికి జూన్ 30 మండల రిపోర్టర్ బండారు ( బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): జులై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం లో భాగంగా సోమవారం మండలంలోని వేములపాడు గ్రామంలో గ్రామ, మండల , నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మరియు అనంతపురం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ చైతన్యం చేసి ఎమ్మార్పీఎస్ ఉద్యమంలోకి చదువుకున్న విద్యావంతులను తీసుకురావాలని పిలుపునివ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ సమావేశంలో వేములపాడు గ్రామంలో నూతన కమిటీ నిర్మాణం జరిగిందని గౌరవాధ్యక్షులుగా వి శ్రీనివాసులు (కమలపాడు), అధ్యక్షులుగా పి బాలు (కోన ఉప్పులపాడు), అధికార ప్రతినిధిగా సి.చిరంజీవి (వేములపాడు), వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల మురళి (పిన్నేపల్లి), ప్రధాన కార్యదర్శి ఎం జానకి రాముడు (కమలపాడు), కార్యదర్శి పి అనిల్ (వేములపాడు), కోశాధికారి సి విజయ్ (వెంగన్న పల్లి), కార్యవర్గ సభ్యులుగా పి అనిల్



కుమార్, ఎం శివశంకర్, ఎల్ ప్రవీణ్ కుమార్, వై విష్ణువర్ధన్, ఎం మహేష్, ఎన్ హరినాథ్ , బండి కుల్లాయప్ప, సీనల్లప్ప, డి మహేంద్ర, పి మోహన్, ఎన్ రవి లను ఎన్నుకోవడం జరిగిందని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ యాడికి మండల సీనియర్ నాయకులు గాంధీ, జీ నరసింహులు, ఏన్ సూర్యుడు, జి రామాంజనేయులు, జి కుల్లాయప్ప, టి ఆదినారాయణ, ఎం చిన్న రాముడు, ఆర్ కంబగిరి, ప్రేమ సాగర్, శివన్న, వెంకట్ రాముడు, శేఖర్, శ్రీరాములు, శ్రీనివాసులు, చదువుకున్న విద్యావంతులు, యువకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాకను స్వాగతించాలి

## గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం విజయవంతం చేయాలి

## టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు






మంథని/ వరంగల్,జూన్ – 30 (నేటి శుభోదయ): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని జిల్లా కాంగ్రెస్ భవన్ లో విలేకరుల సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , వరంగల్ డీసీసీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్గ ,టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు మాట్లాడుతూ..... జులై 4వ తారీఖున ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని వారిని ఘనంగా స్వాగతించాలని,వరంగల్ పార్లమెంట్ నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షులు అందరూ తరలి వెళ్లాలని అన్నారు. వరంగల్ కి విచ్చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబును శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాశమైలారం రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం

## మాజీ ఎంపీ నామ దిగ్భ్రాంతి



హైదరాబాద్, ఖమ్మం, **(నేటి శుభోదయ):** సంగారెడ్డి జిల్లా, పాశమైలారంలో పారిశ్రామిక వాడాలోని ఒక రసాయన పరిశ్రమలో సోమవారం సంభవించిన భారీ అగ్ని ప్రమాదం పట్ల బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం, పలువురికి తీవ్ర గాయాలు కావడం దురదృష్ట కరమన్నారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని, మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించటంతో పాటు, గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు నామ సంతాపాన్ని తెలిపారు. ఇటీవల నెలల వ్యవధిలోనే రాష్ట్రం లో పలు చోట్ల వరుసగా సంభవించిన అగ్ని ప్రమాదాలు ప్రాణ నష్టాలను, ఆస్తి నష్టాలను కలిగించాయని ఇది ఆందోళన కలిగించే విషయమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినమైన విధానాలు రూపొందించాలని నామ డిమాండ్ చేశారు.

# సొసైటీ డైరెక్టర్ గా బొర్రా సత్యనారాయణ...



వి.ఆర్.పురం,జూన్ 30(నేటి శుభోదయ ప్రతినిధి): వరరామ చంద్రాపురం, సొసైటీ డైరెక్టర్ గా బొర్రా సత్యనారాయణను, అధిష్టానం నియమించింది. బొర్రాసత్యనారాయణ, తెలుగుదేశం పార్టీకి అత్యంత విధేయుడు,2024 ఎన్నికల్లో తెలుగు దేశంపార్టీ గెలుపుకోసం కష్టపడి పనిచేశారు.మండలంలో పార్టీ పెద్దలతో మంచి తెలుగుదేశం పార్టీ నాయకునిగాపేరుంది.పార్టీ కోసం నిరంతరం కష్టపడే తత్వం బొర్రాసత్యనారాయణ,సొంతం. సొసైటీ డైరెక్టర్ గా నియమించి నందుకు పార్టీ కార్యకర్తలు,నాయకులు, గ్రామస్తులు,హర్షంవ్యక్తం చేశారు.

# ఎస్సై రాణా ప్రతాప్ భార్య పురుగుల మందు తాగి ఆత్మ హత్య

ఖమ్మం,**(నేటి శుభోదయ):** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలానికి చెందిన ప్రస్తుత జీఆర్పి ఖమ్మం ఎస్సై రాణా ప్రతాప్ భార్య రాజేశ్వరి ఆత్మ హత్య వివాదస్పదం అయింది. తమ కూతురిని ఎస్సైతో సహా ఆయన కుటుంబ సభ్యులు కలిసి దాడి చేసి చంపారని మృతురాలి తల్లి తండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం జిల్లాకి చెందిన రాణా ప్రతాప్ ది ఉద్యోగం వచ్చినప్పటినుండి దురుసుగా వ్యవహరించడంతో పలు మార్లు శాఖ పరమైన చర్యలు తీసుకొన్నారు. గత ఆరు నెలల క్రితం మహబూబాబాద్ జిల్లాలో సస్పెండ్ అయి ఈమధ్య లూప్ లైన్ లో ఖమ్మం పట్టణ రైల్వే ఎస్.ఐగా బాధ్యత తీసుకున్నాడు. ఆయన ప్రజలతో, బంధువులతో, ఆయన భార్యతో కావాలి అని ఘర్షణకు దిగుతుంటాడని,ఆయన ప్రవర్తన బాగుండదని స్థానికులు,మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.



## వృత్తి పరంగా కూడా వివాదస్పదుడిగా అతనికి పేరుంది

గతంలో ఖమ్మం లో ట్రైని ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో ఆర్టీసీ బస్ స్టాండ్ లో ఒక వ్యాపారిని ఆయనతో పాటు ఆయన సోదరుడు అయిన మరో పోలీస్ ఎస్. ఐ ఆ వ్యక్తిపై గన్ను పెట్టి బెదిరించి , దాడి చేసినట్లు రాణా ప్రతాప్ పై ఆరోపణలున్నాయి. మహబూబాబాద్ జిల్లా సీరోల్ పోలీస్ స్టేషన్ లో పని చేస్తూ నడి రోడ్డుపైన ఒక రైతు మీద దాడి చేసాడు. కొంత కాలం తరువాత కురవి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ గా వచ్చి స్టేషన్ గుండ్రాతి మడుగులో ఒక ఇంజనీరింగ్ స్టూడెంట్పైన దాడి చేసాడు. రజాలిపేటలో ఒక దళితుడు హత్యను తారుమారు చేసి సహజ మరణంగా చిత్రికరించే పని చేయగా, సీనియర్ జర్నలిస్ట్ అట్టి హత్య ఉదాంతం బైట పెట్టినందుకు అక్రమ అరెస్టు చేసాడు. ఆ విషయమై ఉన్నతాధికారులకు బాధితుడు డి. వై. గిరి పిర్యాదు చేయగా ఎస్పీ కార్యాలయంకు అటాచ్ చేసి విచారణ చేసారు. తరువాత పెద్ద గూడూర్ మండల కేంద్రంలో ఎస్. ఐ గా పని చేస్తూ ఒక ప్రమాద వాహనాన్ని తారుమారు చేసిన ఆరోపణలపైన ఇన్సూరెన్స్ అధికారులు ఇచ్చిన పిర్యాదు మేరకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ రాంనాథ్ ఆర్ కేకన్ విచారణ జరిపి ఉన్నాతాధికారులకు నివేదిక పంపించిగా రాణా ప్రతాప్ ను ఇటీవల సస్పెండ్ చేసారు. నిత్యం దురుసు ప్రవర్తన వల్ల ప్రజలతో వ్యవహరించినట్లు , తన భార్యతో అలాగే ఉండి ఆ వివాహిత మరణానికి కారణం అయినట్లు మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. ఆవేశంకు లోనైనా వారు వారి అందరికి దేహశుద్ధి చేశారు. అనుమానస్పద మరణంగా పోలీస్ కేసు నమోదు చేసి మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితులను మృతురాలి బంధువుల దాడి నుండి రక్షించి పోలీసుల అదుపులో ఉంచుకున్నారు.

# పీయంఆర్ ట్రస్టు నుంచి పలకలు, ట్యాబ్లు పంపిణీ



నేలకొండపల్లి,**(నేటి శుభోదయ):** పీయంఆర్ ట్రస్టు నుంచి మండల విద్యా వనరుల కేంద్రంలో పని చేస్తున్న సీఆర్పీ, సిబ్బంది లకు సోమవారం ట్యాబ్లను పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య ల చేతుల మీదుగా ఏడుగురు కు ట్యాబ్లను అందించారు. అదే విధంగా మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ,చలపతిరావు, సీఆర్పీ లు, సిబ్బంది, పీయంఆర్ ట్రస్టు నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రి డివిజన్ ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ పదవీ విరమణ






యాడికి , జూన్ 30 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): తాడిపత్రి డివిజన్ లో ప్రభుత్వ నేత్రవైద్యాధికారి గా వైద్య సేవలు అందించిన గాదిరాజు మధుసూదనరాజు సోమవారం యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో పదవీ విరమణ చేశారు.జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం లో భాగంగా దాదాపు 40 సంవత్సరాలపాటు ఉమ్మడి రాష్ట్రం లోని వివిధ జిల్లాలలో ఆయన పనిచేశారు.1993 నుండి నేటి వరకు 32 సంవత్సరాలు గా తాడిపత్రి నియోజకవర్గం లో గుత్తి గుంతకల్లు పరిధిలో, తాడిపత్రి ఆసుపత్రి లో విజన్ సెంటర్ లో ముఖ్య మంత్రి ఈ ఐ కేంద్రం లో, దృష్టి మరియు కంటి వెలుగు కార్యక్రమాలలో కంటి వైద్య



అధికారిగా నిరవధికంగా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారులు డా.సాయి సుమంత్ రెడ్డి, మలేరియా ఆఫీసర్ శ్రీనివాసులు, సి హెచ్ వో జుబేదా, హెచ్ ఎస్ ఏ ఆర్ పి గౌడ్, మద్దిలేటి, శరత్ తదితరులు సిబ్బంది ఆయనను అభినందించారు.

# 20 కుటుంబాలు సిపిఐ పార్టీలో చేరిక

## పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన సిపిఐ జిల్లా కార్యదర్శి సీ. జాఫర్



యాడికి జూన్ 30 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ. ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): మండల కేంద్రంలో యాడికి మండల 9వ మహాసభల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ యాడికి పట్టణానికి చెందిన 20 కుటుంబాలు సిపిఐ పార్టీలో చేరారు. సిపిఐ యాడికి మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, సిపిఐ పట్టణ కార్యదర్శి చిన్న కుల్లాయి రెడ్డి ఆధ్వర్యంలో సి, జాఫర్, వీకే ప్రదీప్ రెడ్డి, మల్లికార్జున, రాజారెడ్డి చేతుల మీదుగా సిపిఐ పార్టీలో చేరిన పామిశెట్టి రాజు, రామాంజి రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పరంధాముడు, పాపారాయుడు, మహేష్ ఆచారి, చైతన్య కృష్ణ పల్లా రమేష్, చింతా వెంకట రమణయ్య, సురేష్, జయ కృష్ణ, షేక్షావలి, చట్టా రాము, మౌలాలి, చంటి, రామయ్య ఆచారి, భాస్కర్ సిపిఐ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిత్యం నిరుపేద బడుగు, బలహీన, కార్మికులు కూలీల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ పార్టీ చేస్తున్న ఉద్యమాలు పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వేములపాడు మాజీ సర్పంచ్ వి. కె. ప్రదీప్ రెడ్డి,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లింగమయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప యాదవ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు ఇమామ్, సిబిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరాముడు యాదవ్ సిపిఐ సీనియర్ నాయకులు ఓబిరెడ్డి, నీలూర్ లక్ష్మయ్య జూటూరు బ్రదర్స్ బషీర్, అబ్దుల్ రజాక్, ఇస్మాయిల్, అమీర్ భాష, మహబూబ్ రబ్బాని, సర్దార్ ఫిరోజ్, సోహెబ్ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు గరిడీ శివన్న బండారు రాఘవ తదితరులు పాల్గొన్నారు....

# హత్య కేసులోఆకోజు సునీల్ కి ముందస్తుబేలు మంజూరు....!




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం, జూన్ 30, (నేటి శుభోదయ): ఓ హత్య కేసులో 15వ నిందితుడిగా ఉన్న భద్రాచలం పట్టణానికి చెందిన ఆకోజ్ సునీల్ కి తెలంగాణ హైకోర్టు ముందస్తుబేల్ నీ మంజూరు చేసింది. మే ఏడో తారీఖున పట్టణానికి చెందిన కనితి సతీష్ కి అదే కాలనీలోకి చెందిన మరి కొంతమంది యువకులకు జరిగిన ఘర్షణలో కనితి సతీష్ మృతి చెందిన విషయం తెలిసిందే అట్టి కేసులో ఇప్పటికే కొంతమంది నింతులను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించగా 15వ నిందితుడిగా ఆరోపిస్తూ ఆకో సునీల్ పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం కూడా తెలిసిందే. అతి జరిగిన మూడు రోజులు అనంతరం కనితి సతీష్ కుటుంబ సభ్యులు పత్రికల సమావేశం పెట్టి పలు రాజకీయ కోణాలలో సునీల్ పై ఆరోపణలు చేయగా ఈ ఉదాంతం కాస్త రాజకీయారంగు పులుముకున్న విషయం తెలిసిందే. ఇట్టి విషయంపై సునీల్ హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు న్యాయవాదులైన బీవీ కార్తీక్ ఎండి రిజ్వాన్ నేతృత్వంలో పలుమార్లు ముందస్తు బేల్ దాఖలు చేయగా సోమవారం న్యాయమూర్తి ఆకో సునీల్ కి 25వేల రూపాయల పూచికత ముందస్తుబేలను మంజూరు చేశారు.

# సంక్షేమ పథకాల పై విస్తుత ప్రచారం చేయాలి

## యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజని




నేలకొండపల్లి,**(నేటి శుభోదయ):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి విస్తృత ప్రచారం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు...రానున్న స్థానిక సంస్థలలో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కు శ్రీరామ రక్ష అన్నారు. పార్టీ ని మరింత బలోపేతం చేసేందుకు వార్డుల వారీగా ఏర్పాటు చేసిన కమిటీ ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ లను భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం. రేషన్కారులు ఇతరత్రా పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్లు వంగవీటి నాగేశ్వరరావు, మామిడి వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, నాయకులు చిదుముల జెర్రిపోతుల సత్యనారాయణ, జానిరెడ్డి, వాకా శ్రీనాథ్, రాంబాబు, కడియాల నరేష్, రంగయ్య, ఐతనబోయిన శ్రీనివాసరావు, మోర మల్లయ్య, కైలాపసు వెంకటేశ్వర్లు, గుడిబోయిన వెంకటేశ్వర్లు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ఆమనగల్లు,జూన్ 30(నేటి శుభోదయ): నేడు మున్సిపాలిటీ కేంద్రంలో ఉదయం 10:30ని.లకుఎమ్మెల్యేకసిరెడ్డి నారాయణరెడ్డి రెండుఓపెన్‌జిమ్ లను ప్రారంభించనున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కృషితో తెలంగాణ ప్రభుత్వం ఆమనగల్లు మున్సిపాలిటిలో 15 వ ఆర్థిక సంఘం నిధులతో ఒక్కొక్కటి 13,00,000/-లి (పదమూడు ) లక్షల రూపాయల చొప్పున మొత్తం 26 లక్షల రూపాయల వ్యయంతో రెండు ఓపెన్ జిమ్ లను ప్రారంభించనున్నారు. యువతీ, యువకులు,ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, ఔత్సాహికుల ఆరోగ్య పరిరక్షణను ఆకాంక్షించి మన ఆమనగల్లు పట్టణంలో 26 లక్షల రూపాయలవ్యయంతో రెండు ఓపెన్ జిమ్ లతో పాటు రెండు పార్క్ ల ఏర్పాటుకు సహకరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిమ్ లు మరియు పార్క్ ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసిన మున్సిపల్ కమీషనర్ శంకర్ నాయక్,మున్సిపల్ డిఈఈ, ఏ.ఈ ల సహకారంతో ఓపెన్ జిమ్ లను పూర్తి చేయటం జరిగింది.

# పోలవరం నిర్వాసితుల సమస్యలపై జరుగు ధర్నాను జయప్రదం చేయండి...

## సి.పి.ఎం! పార్టీ...



వి.ఆర్.పురం,జూన్30(నేటి శుభోదయ ప్రతినిధి): జులై 2 న పోలవరంనిర్వాసితులసమస్యల పరిష్కారం కోరుతూ!మండల తహసీల్దార్ కార్యాలయంలో సి.పి.ఎం, పార్టీఆధ్వర్యంలో జరిగేదర్నాలో నిర్వాసితులు అధికసంఖ్య లో పాల్గొనిజయప్రదంచేయాలని,సి.పి.ఎం,పార్టీ మండల కమిటీపిలుపు నిచ్చింది.సోమవారం,పార్టీ కార్యాలయంలో కారంసుందరయ్య, అధ్యక్షతన మండలస్థాయిసమావేశం, జరిగింది.ఈసమావేశంలో పార్టీజిల్లా కమిటి సభ్యులు,మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మాట్లాడుతూ!నిర్వాసితుల సమస్యలుపరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్రనిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని,41.15 – ఎ గ్రామాలలోని నిర్వాసితులకు నేటికీ ఆర్–ఆర్ ప్యాకేజీ పూర్తి స్థాయిలో ఇవ్వలేదని,భూనష్టపరిహారం చెల్లించలేదని,పైగాపునరావాస కాలనీలో కల్పించాల్సిన సదుపాయాలు కల్పించకుండా వరదలపేరుతో తరలివెళ్లాలని చెప్పడం దారుణమని, ఆయన వాపోయారు.ఇలాంటి చట్ట విరుద్ధమైన పనులుచేస్తే సి.పి.ఎం, పార్టీ చూస్తూ!ఊరుకోదని హెచ్చరించారు.13 సంవత్సరాల క్రితం భూములు మునుగుతాయని నోటిఫికేషన్ ఇచ్చి నేటికీ భూములు ఇవ్వకుండా!ముంపులో చూపిస్తూ విత్తనాలుఇవ్వకుండా!పంటను కొనుగోలు చేయమని చెప్పడం,ఈ క్రాఫ్ చేయకుండా రైతుభరోసా! అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేయకుండా!రైతులనుతీవ్ర అన్యాయం చేయడం దారుణమని తక్షణమే విత్తనాలు పంపిణీ చేయాలని,పండించిన పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.పరిస్థితి అలాఉంటే ప్రయారిటీ గ్రామాలనిర్వాసితుల పరిస్థితిఏమిటో గందరగోళంగానే ఉన్నదని,సకాలంలోపంటలువేసి పండించలేక,పునరావాసకల్పన,నష్టపరిహారంసకాలంలో అందక నిర్వాసితులు నిస్సహాయ స్థితిలోకొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆరోపించారు.ఎప్పుడు పూర్తిఅవుతుందో!ఎప్పుడు పునరావాసం కల్పిస్తారో! తెలియకుండానే కటాఫ్ తేదీలు ప్రకటించి18 సంవత్సరాలు నిండిన యువతీయువకులనుఅనాథలుగా, ఈపాలక ప్రభుత్వాలు మారుతున్నాయని ఆయన ఆరోపించారు.అందుకే సి.పి.ఎం, పార్టీ ఆధ్వర్యంలో,ఈధర్నా కార్యక్రమం అన్నీ మండల కేంద్రాల్లో చేపడుతున్నామని చెప్పారు. పోరాడితే పోయేదేమీ లేదు మన సమస్యలు పరిష్కారం తప్పని ఆయన గుర్తు చేశారు.జూలై 2 న జరిగే ధర్నాలో అత్యధిక స్థాయిలో నిర్వాసితులుపాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల ఎం.పి.పి,కారం లక్ష్మి,నాయకులుకారం సుందరయ్య,పూనెం ప్రదీప్ కుమార్, (ఎం.పి.టి.సి), పొడియం. శ్రీరామ్మూర్తి, వడ్లాది రమేష్,తోడం రాజు,గుండిపూడి లక్ష్మణ్ రావు, కమ్మచిచ్చుసత్యనారాయణ,పులి.బొజ్జి,సీరపు తాతబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా డాక్టర్ ఎస్. జయలక్ష్మి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 30, (నేటి శుభోదయ): తెలంగాణ ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం, 28-జున్ -2025 నాటి లెటర్ నెం. 2400/ ఈ 1-బి /2025 ద్వారా, కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ జూన్ 30, 2025 నుండి పదవీ విరమణ పొందిన తర్వాత విధుల నుండి రిలీవ్ చేయబడ్డారు.ఆయన స్థానం లో, కొత్తగూడెం డిప్యూటీ సివిల్ సర్జన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. జయలక్ష్మికి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పదవికి పూర్తి అదనపు బాధ్యతను అప్పగించారు.

## పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం అందించిన అమిలినేని ఫ్యామిలీ



యాడికి జూన్ 30 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): మండలంలోని పచ్చారు మేకలపల్లి కి చెందినటువంటి క్రీ.శే. అమిలినేని వెంకటనాయుడు ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి ధర్మపత్ని అయినటువంటి అమిలినేని లక్ష్మీదేవి పేద విద్యార్థుల చదువు కోసం రాయలచెరువు లయన్స్ క్లబ్ వారికీ 10000 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. రాయలచెరువు గ్రామానికి చెందినటువంటి కూలీ పనులు చేసుకుంటున్న కమలమ్మ కుమార్తె దుర్గా భవాని ఇంటర్ లో మంచి మార్కులతో పాస్ అవ్వడం జరిగింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనటున్న వారికీ పైచదువుల నిమిత్తం పుస్తకాల కొరకు 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమిలినేని లక్ష్మీదేవి , లయన్స్ క్లబ్ అధ్యక్షులు చల్లా సూర్యనారాయణ , నూతన ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ శెట్టి , లయన్ కులాశేఖర్ , లయన్ సత్యనారాయణ , లయన్ ప్రసాద్, లయన్ కూచి సూర్యనారాయణ , లయన్ రాంమోహనరెడ్డి , లయన్ ఇస్మాయిల్ గారు తదితరులు పాల్గొనడం జరిగింది...

## పదవి విరమణ సన్మాన సభ



ఆమనగల్లు,జూన్ 30(నేటి శుభోదయ): ఆమనగల్లు పురపాలక సంఘంలో గత 33 సం.లుగా వాటర్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న ఎండి మొయినొద్దిన్ సోమవారంతో తన పదవి కాలాన్ని పూర్తి చేసుకున్నాడు.అందుకు అనుగుణంగా మున్సిపాలిటీ కార్యాలయంలో కమీషనర్ శంకర్ నాయక్ పదవి విరమణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొయినొద్దిన్ ను మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాలిటీ కమీషనర్ శ్యామ్ సుందర్,మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్ లు,మాజీ సర్పంచ్,తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఉద్యోగి మంద అంజయ్య స్వరూప దంపతులకు సహోద్యోగుల ఘన సన్మానం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / మణుగూరు ప్రతినిధి, జూన్ 30,( నేటి శుభోదయ): సింగరేణి సంస్థలో ముప్పై ఆరు సంవత్సరాల పాటు పనిచేసే సుదీర్ఘకాలం ఓ సీ- 2 రిలే సి లో ఈ పి ఆపరేటర్ గా పనిచేసి



సోమవారం నాడు పదవీ విరమణ చేసిన డంపర్ ఆపరేటర్ మంద అంజయ్య స్వరూప దంపతులను పీకే - 2 నూతన కార్యాలయ ఆవరణలో సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, సహోద్యోగులు పీవీ కాలనీ గోల్డెన్ ఫంక్షన్ హాల్లో మాజీ కార్మికులు, బంధుమిత్రులు శాలువా పూలదండలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగపర్వంలో పనిలో అంకిత భావం రక్షణతో కూడిన ఉత్పత్తి అధికారులకు మర్యాద సహోద్యోగులతో స్నేహభావం వెరసి అంజయ్య సేవలు నూతన ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని 36 ఏళ్ల సర్వీస్ లో ఏ చిన్న రిమార్కు కూడా లేకుండా ఎంతో ఆరోగ్యంగా పదవీ విరమణ చేయటం అంజయ్య ప్రత్యేకత అని కొనియాడారు. అంజయ్య




విశ్రాంత జీవితం ఆనందమయం కావాలని అందరూ ఆకాంక్షిస్తూ పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ కె సురేష్ కుమార్, సి రిలే ఇన్ చార్జ్ డిప్యూటీ మేనేజర్ భూక్య భాంగ్య, సంక్షేమ అధికారి కిరణ్ గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వై రాంగోపాల్ ఎస్ కుమార్ స్వామి, ప్రాతినిధ్య సంఘం ఐ ఎన్ టి యు సి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, మల్లికార్జున్ అందరితో ఎంతో కలుపుగోలుగా ఉండే అంజయ్య పదవీ విరమణ సందర్భంగా సహోద్యోగులు బంధుమిత్రులు మాజీ కార్మికులతో వేదిక వద్ద సందడి నెలకొంది.

## మంత్రి పొంగులేటి సొంత మండలంలో రిజిస్ట్రార్ విధులకు డుమ్మా

### పట్టు తప్పుతున్న రిజిస్ట్రార్ కార్యాలయాలు

### కల్లూరు లో వివాదాస్పద భూములను సైతం రిజిస్ట్రేషన్




ఖమ్మం,(నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత మండలం కల్లూరు లోనే పని చేస్తున్న రిజిస్ట్రార్ విధులకు డుమ్మా కొడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఆ శాఖ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమూల మార్పులు, చేర్పులు చేసి సంచలనం సృష్టించారు. ఆ సంచలనం ప్రస్తుతం మూన్నాళ్ళ ముచ్చట గానే మిగిలిపోయింది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం లో రిజిస్ట్రార్ గా విధులు నిర్వహిస్తున్న ఎం డి ఖాజామెసీనుద్దీన్ మాత్రం వారంలో కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే విధులకు హాజరు అవుతున్న సంఘటన చోటు చేసుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత మండలం లోనే పరిస్థితి ఇలా ఉంటే ఇగ వివిధ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం కాని ప్రశ్న. మొత్తం మీద రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆ శాఖ ఉన్నతాధికారులకు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి పట్టు తప్పు తున్నట్టుగా అనుమానం కలగమానదు. మరోవైపు కల్లూరు రిజిస్ట్రార్ గా విధులో చేరిన నాటి నుంచి పలు వివాదాస్పద భూములను సైతం రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోర్టు కేసులు, కమర్షియల్ టాక్స్ కు అటాచ్ మెంట్ ఉన్న భూములు, ఇంకా ప్రభుత్వ భూములను సైతం రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. ఈయన గతంలో పలు చోట్ల పని చేసిన చోట్ల పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తాను ఏది చేసినా తనకు మా శాఖ ఉన్నతాధికారుల అండ దండలు ఉన్నట్టు చెప్పడం కొసమెరుపు. కల్లూరు మండల రిజిస్ట్రార్ గా విధులో చేరిన నాటి నుంచి నేటి వరకు అయన చేసిన రిజిస్ట్రేషన్ లపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే మరిన్ని అక్రమాలు బయట పడే అవకాశం ఉంది మరి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని కల్లూరు మండల వాసులు కోరుతున్నారు.

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

### నంది మేడారంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసిన మంత్రి



పెద్దపల్లి /ధర్మారం, జూన్ -30 (నేటిశుభోదయ): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ధర్మారం మండలంలోని నంది మేడారం లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ....ఏసిడిపి నిధులు సరిపోని పక్షంలో నంది మేడారం గ్రామంలో అభివృద్ధి పనులకు కలెక్టరేట్ నిధుల నుంచి 3 కోట్లు కలెక్టర్ మంజూరు చేశారని అన్నారు. కోటి 30 లక్షల రూపాయలను నంది మేడారం గ్రామంలో అభివృద్ధి పనులకు కేటాయించామని అన్నారు. నంది మేడారం గ్రామంలో 261 విద్యుత్ పోల్స్ తరలింపు కోసం 26 లక్షల రూపాయలు



మంజూరు చేసామని అన్నారు. 80 లక్షల రూపాయల విలువ గల అంతర్గత సిసి రోడ్లు వేసుకున్నామని, మేడారం నుంచి కట్కెనపల్లి, కోర్టు వరకు సీసీ రోడ్డు పనులు నెల రోజులలో మంజూరు చేస్తామని అన్నారు. నంది మేడారం గ్రామంలో అర్హులైన 80 మంది నిరుపేదలకు మొదటి విడత కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉన్న తప్పనిసరిగా ఇండ్లు మంజూరు అవుతాయని, ఎవరు బాధపడాల్సిన అవసరం లేదని అన్నారు. స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వ ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసే ఆలోచన చేస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాల ద్వారా బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీ కు అద్దె కు పెట్టడం జరిగిందని, దీనివల్ల ప్రతి నెల 46 వేల రూపాయల ఆదాయం లభిస్తుందని అన్నారు. పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి .గంగయ్య , పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లింగమూర్తి, ధర్మారం తహసిల్దార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

### ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి



కైకలూరు,(నేటి శుభోదయ): కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం శృంగవరప్పాడులో కొల్లేరు ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, కొల్లేరు పరిరక్షణ సమితి ప్రతినిధులతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి తాను కైకలూరు నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సందర్భంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలు కొల్లేరు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని ఎంపీ తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఎంపీగా



విజయం సాధించిన అనంతరం కొల్లేరు ప్రాంత వాసుల సమస్యపై పూర్తి అవగాహన చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి నోచుకోదని, ఆ విషయంలో జోక్యం చేసుకోవద్దని కొందరు సన్నిహితులు తనను వారించినా, కొల్లేరు ప్రజలకు న్యాయం జరగాలని కోరుకున్న తాను వారి పక్షాన నిలబడినట్లు ఎంపీ స్పష్టం చేశారు. సమస్య ఎప్పటిలోగా పరిష్కారం అవుతుందనే నిర్దిష్టమైన గడువు తాను చెప్పలేనని, కొల్లేరు సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఘంటాపథంగా తెలియజేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగానే, మానవతా దృక్పథంతో కొల్లేరు ప్రజల సమస్యకు పరిష్కారం చూపుదామని భరోసా కల్పించాలని ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ కొల్లేరు సమస్య అనే చిక్కుముడిని ఒక్కొక్కటిగా విప్పుకుంటూ ముందుకు వెళుతున్నట్లు ఎంపీ వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల కొల్లేరు ప్రాంతంలో పర్యటించిన సెంట్రల్ ఎంపవర్మెంట్ కమిటీ ప్రతినిధులు కూడా సానుకూలంగానే నివేదిక సమర్పించారని ఎంపీ తెలిపారు. ఈ ప్రాంతంలో నెలకొన్న ఇతరత్రా సమస్యలను మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వివరించనున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. కొల్లేరు ప్రాంత వాసులు ధైర్యంగా ఉండాలని, కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు అండగా ఉన్నాయని, త్వరలోనే శుభవార్త వింటారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా కల్పించారు. అనంతరం కొల్లేరు ప్రాంత ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. తొలిసారి తమ గ్రామానికి వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. అంతకు ముందు శృంగవరప్పాడుకు చెందిన మహిళలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతూ బ్రహ్మ రథం పట్టారు. అనంతరం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కొల్లేటికోటలో కొలువైన శ్రీశ్రీ పెద్దింటి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

## పేదల విద్య పైన చిత్త శుద్ధిలేని రాష్ట్ర ప్రభుత్వం

### జులై 4,5 తేదీ లలో జరిగే జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

### కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్




ఇబ్రహీంపట్నం జూన్ 30 (నేటి శుభోదయ): కెవిపిఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతు లు జులై 4,5 తేదీలలో తుర్కయాంజల్ మున్సిపాలిటీ మన్నెగూడ ఎన్ ఎస్ ఆర్ నగర్ లో 2 రోజుల పాటు జరగబోతున్నవి ఈ క్లాసుల జయప్రదాన్ని కోరుతూ రగన్నగూడ జిల్లా ప్రజాసంఘాల జిల్లా ఆఫీస్ లో ప్రెస్ మిట్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా కె.వి.పి.ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ సామెల్ మస్కు ప్రకాష్ కారత్ లు మాట్లాడుతూ కె.వి.పి.ఎస్ రంగారెడ్డి జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు జులై 4,5 తేదీలలో మన్నెగూడా ఎన్ ఎస్ ఆర్ నగర్ కాలనిలో జరగబోతున్నవి ఈ క్లాసులు జయప్రదం చేయాలన్నారు గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారని బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థినీ విద్యార్థులకు నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు ఉండడం వలన జిల్లాలో విద్యార్థులను స్కూల్లో జాయిన్ చేసుకోవడం లేదని ఫీజులు కట్టమని పుస్తకాలు బట్టలు కొనమని ఎంతో మనోవేదనకు యజమాన్యాలు గురిచేస్తున్న అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర మంత్రులు కానీ జిల్లా కలెక్టర్ కానీ ఎలాంటి శ్రద్ధ చూపడం లేదన్నారు విద్యార్థులకు విద్యను అందించుట ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చేసి ప్రతి ఒక్క విద్యార్థిని జాయిన్ చేయించి బట్టలు పుస్తకాలు అందించాలని కోరారు సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జే ఆశీర్వాదం యాదగిరి పి జంగయ్య పగిళ్ల మధు జ్యోతిబాస్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణిలో (73 ) ఫిర్యాదులు

### ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు



ఇబ్రహీంపట్నం జూన్ 30 (నేటి శుభోదయ): రంగారెడ్డి జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారానికై ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ -32, ఇతర శాఖలకు -41, మొత్తం 73 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపర్డెంట్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గుడివాడ రోటరీ క్లబ్ కు 20 ప్రతిస్థాత్మక అవార్డులు




గుడివాడ, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడకు 2024-25 సంవత్సరానికి 20 ప్రతిష్ఠాత్మక అవార్డులు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ సేవా సంవత్సరంలో అనేక విశిష్ట కార్యక్రమాలను నిర్వహించి, 3020 రోటరీ జిల్లా స్థాయిలో అత్యున్నతంగా నిలిచిందన్నారు. ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన జిల్లా అవార్డు ప్రదానోత్సవంలో మా క్లబ్‌కు మొత్తం 20 అవార్డులు లభించడం గర్వకారణంగా ఉందన్నారు. ఉత్తమ అధ్యక్షుడు,ఉత్తమ కార్యదర్శి, ఉత్తమ క్లబ్, గవర్నర్ క్లబ్ ఎక్సలెన్స్ అవార్డు, పోలియో ప్లస్ సొసైటీ చాంపియన్ క్లబ్, రోటరీ ఫౌండేషన్‌కు అత్యధిక విరాళం ఇచ్చిన క్లబ్, సభ్యత్వం పెంపు అవార్డు,రక్తదాన శిబిరం నిర్వహణ ద్వారా జిల్లా లక్ష్యం సాధించిన క్లబ్‌గా గుర్తింపు పొంది గవర్నర్ అధికారిక సందర్శనను విజయవంతంగా నిర్వహించినందుకు వృత్తి సేవ, మాతృత్వం-శిశు ఆరోగ్యం, పర్యావరణం, విద్య, ఆరోగ్యం, సామాజిక సేవల విభాగాల్లో విశిష్ట సేవలకు సంబంధించి ఎనిమిది అవార్డులు యువజన సేవా కార్యక్రమాల నిర్వహణకు అభినందన తెలుపుతూ రోటరీ ఫౌండేషన్‌కు 1000 యు. ఎస్. డి విరాళం ఇచ్చినందుకు రెండు ప్రత్యేక మిడ్‌టర్మ్ అవార్డులు ఇన్ని వార్డులు విజయవంతంగా సాధించిన అధ్యక్ష, కార్యదర్శులను క్లబ్ కౌన్సిలర్స్ రొటేరియన్ జి.బాబు శ్రీకర్, రొటేరియన్ డాక్టర్ పి.విశ్వేశ్వరరావు క్లబ్ సభ్యులు అభినందించారు ఈ పురస్కారాలు మా క్లబ్ సభ్యుల అంకితభావం, నిస్వార్థ సేవా దృక్పథం మరియు సంఘానికి ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. ఈ విజయాన్ని సాధించడంలో భాగమైన ప్రతి రొటేరియన్‌కు మనఃపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి గుళ్ళపల్లి కిరణ్, సభ్యులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, నరేష్, సతీష్, పలువురు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి



ఏన్కూర్,(నేటి శుభోదయ): ఏన్కూరు మండలం హిమామ్ నగర్ గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనాన్ని టాటా ఏసీ ఎదురుగా వేగంగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన హోంగార్డు ఇమ్మడి రఘుపతి దమ్మపేట మండలం అంకంపాలానికి చెందిన బత్తుల రాజేష్ ఇరువురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... మృతుడు రాజేష్ ఖమ్మంలో నివాసం ఉంటూ ఉద్యోగరీత్యా కొత్తగూడెంకు రోజు బస్సు ప్రయాణం చేసేవాడు. సోమవారం ఖమ్మం నుండి తనద్విచక్ర వాహనంపై బయలుదేరిన క్రమంలో మార్గమధ్యంలో పల్లిపాడు గ్రామంలో రఘుపతి లిఫ్ట్ అడిగి రాజేష్ ద్విచక్ర వాహనం ఎక్కాడు. ఇరువురు కొత్తగూడెం వెళుతున్న క్రమంలో, చంద్రుగొండ మండలం వెంగన్నపాలెం నుండి కేసుపల్లికి కి బయలుదేరిన టాటా ఏసీ వాహనం హిమామ్ నగర్ వద్ద వేగంగా ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇరువురికి తీవ్ర గాయాలు అయినాయి. వెంటనే 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రతి ఉద్యోగిపదవీ విరమణ సహజమే



ఏన్కూర్ ,(నేటి శుభోదయ): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ సహజమే అని ఏన్కూరు తాహసిల్దార్ సిహెచ్ శేషగిరిరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కూరాకుల సైదయ్య పదవి విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సైదయ్య ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి విద్యార్థుల కోసం ఎంతో సమయాన్ని కేటాయించి విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదగాలన్న ఉద్దేశంతో అహర్నిశల శ్రమించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దిన ఘనత దక్కిందని ఆయన కొనియాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంతో సేవ చేసి ఈ పాఠశాలను తీర్చిదిద్దటంలో ప్రముఖ పాత్ర వహించారుని ఆయన అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అనేక సేవా కార్యక్రమాల్లో కూడా నిర్వహించారని, మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న సైదయ్య ను ఆ భగవంతుడు మరిన్ని సేవలు చేసే భాగ్యాన్ని కల్పించాలని, ఆయన శేష జీవితాన్ని సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తోటి ఉపాధ్యాయులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ మండల శాఖ అధికారులు పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మదర్ డైరీ కుర్మిద్ద సొసైటీ అధ్యక్షులుగా
# 11వ సారి ఏకగ్రీవం ఎన్నిక
### బందే మహేందర్ రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు



ఇబ్రహీంపట్నం జూన్ 30 ( నేటి శుభోదయ): రంగారెడ్డి నల్గొండ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం యాచారం మండలం కూర్మిద్ద గ్రామంలో పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ టీచర్ గోపిరెడ్డి కిషన్ రెడ్డి నిర్వహించారు. అనంతరం నూతన పాలకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా 11వసారి ఏకగ్రీవంగా బందే మహేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా సురిగి జంగయ్య, పలమోని నరసింహ మరికొంతమదితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్గ ఎన్నికైన సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... పాడి రైతులకు నిరంతరం అండగా ఉంటానని అన్నారు. ఐదు పాల బిల్లులు రైతులకు పెండింగ్లో ఉన్నా కూడా సొసైటీ రైతులకు సంఘంలో ఉన్న డబ్బులతో బిల్లులో చెల్లించుకుంటూ ఇప్పటివరకు అన్ని విధాలు రైతులను కాపాడుకుంటూ వచ్చానని తెలిపారు. సంగం మంచి లాభాల బాటలో నడుస్తుందన్నారు. గత సంవత్సరంలో దాదాపు ఐదు నెలలపాటు బర్రె పాలు లీటర్ కు మూడు రూపాయలు, ఆవుపాలకు రూపాయినర తగ్గించడం జరిగిందని వివరించారు. అయినా కూడా సంఘంలో ఉన్న నిధులతో రైతులకు యధావిధిగా పాత పద్ధతిలోనే బిల్లులు చెల్లించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కమిటీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు

## మోడల్ విలేజ్ వెరిఫికేషన్ లో పాల్గొన్న కేంద్ర కమిటీ సభ్యులు




నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ కోవిలంపాడు) : స్వచ్ఛ్ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 - మోడల్ విలేజ్ వెరిఫికేషన్ భాగంగా సోమవారంకోవిలంపాడు పంచాయతీ లో సెంట్రల్ కమిటీ సభ్యులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లో ఇంటింటికి తిరిగి హౌస్ హోల్డ్ సర్వే చేసి ,గ్రామం లో స్వచ్ఛ భారత్ భాగం లో ప్రజలను అడిగి నీటి నిల్వలు ,పరిశుభ్రత ,డ్రైనేజీ మరియు మురికి నీరు వెళ్లే మార్గాలను అడిగి తెలుసుకున్నారు. చెత్త షెడ్ లు ,వాటిలో పొడి ,తడి చెత్త వేరు చేసే విధానాలు మరియు రీసైకిల్ మెనేజ్ మెంట్ గురించి వివరాలు సేకరించారు. అంగన్వాడీ పాఠశాల ,ప్రాథమికోన్నత పాఠశాల ,ఆరోగ్య కేంద్రం ,మసీద్ ,సచివాలయం ఉండే సౌకర్యాలు , పరిసరాల పరిశుభ్రత ను పరిశీలించారు . ఈ కార్యక్రమం లో స్వచ్ఛ భారత్ అధికారులు ,మండల ఈఓపీఆర్ డి రావణయ్య ,ఏఈ మోహనరావు ,పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు ,పాండు రంగా ,ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిది షేక్ రజ్జబ్ బాషా ,సచివాలయం సిబ్బంది ,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గున్నారు .

## ప్రతి పాఠశాలలో 10 సూత్రాలు పాటించాలి
### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
### ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి
### హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, జూన్-30 ( నేటి శుభోదయ): ప్రతి పాఠశాలలో 10 సూత్రాలు పాటించాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పెద్దపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ....

#### ప్రతి పాఠశాలలో పది సూత్రాలు పాటించాలని వాటిలో

1) ప్రతి రోజు ఉపాధ్యులు మరియు విద్యార్థుల సంఖ్య ఆధారం గా ఫ్స్ వేయాలి 2) హెడ్మాస్టర్ లు మరియు టీచర్స్ సెలవులు రీజనబుల్ గా ఉండాలి 3) మ్డమ్ ప్రతిరోజూ పర్యవేక్షించాలి 4)ప్రాథమిక పాఠశాలలో ఫ్లాన్ నిర్వహించాలి 5) హైస్కూల్ లో లిప్ నిర్వహించాలి 6) ప్రతి నెల 25వ తేదీన స్టాఫ్ మీటింగ్ నిర్వహించాలి 7) ఉడిస్ అప్డేట్ చేయాలి 8) పీటీఎం లొ 60%తల్లి తండ్రులు అటెండ్ అయ్యేట్టట్టు చూడాలి 9) కాంప్లెక్స్ హెడ్మాస్టర్లంతా విధిగా క్లస్టర్ను పర్వేక్షించాలి 10) ఎఫ్ ఎల్ ఎన్ లో ఈసారి 85% టార్గెట్ రీచ్ కావాలి. ప్రస్తుత సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యాలు తప్పనిసరిగా చేరుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని, కనీసం 90 శాతం విద్యార్థులకు చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ అర్థం కావాలని అన్నారు. ప్రభుత్వ సర్కులర్ ప్రకారం పాఠశాలలో 10 శాతం కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఒకే రోజు సెలవు తీసుకోకుండా చూడాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభం లోనే లక్ష్యాలను నిర్దేశించుకోని వాటి సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. వచ్చేది వర్షాకాలం కావున మధ్యాహ్న భోజనం నాణ్యత లో పరిశుభ్రంగా ఉండేలా, వండే వంటలు క్వాలిటీ గా ఉండాలని, పాఠశాలలో పిచ్చి మొక్కలు ఉంటే వెంటనే తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, పీఎం షేక్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మధ్యంతర చదువులు మానిన పిల్లలు ఎక్కువగా ఉన్న బడులపై ప్రత్యేక దృష్టి సారించాలి
### కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:జూన్ 30(నేటి శుభోదయ): మధ్యంతరంగా చదువులు మానిన పిల్లలు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని సర్కారు బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ సోమవారం మండల విద్యా శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 06 నుండి 12 వరకు నిర్వహించిన బడిబాట సందర్భంగా నూతనంగా నమోదైన ప్రవేశాల గురించి ఒక్కో మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రభుత్వ బడులలో మెరుగుపడిన మౌలిక సదుపాయాలు, ఉత్తీర్ణత, భర్తీ అయిన టీచర్ల ఖాళీలు, నాణ్యమైన విద్యా బోధన, ఉచితంగా యూనిఫామ్ లు, టెక్స్ట్ బుక్కులు, నోట్ బుక్కులు సమకూరుస్తున్న విషయాల గురించి ఇంటింటికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని, ఈ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అవసరమైన బడులలో కిచెన్ షెడ్ లు వంటి వాటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. పదవ తరగతి పూర్తి చేసుకుని పై చదువులలో చేరని వారిని గుర్తిస్తూ, ఒక్కో విద్యార్థి వారీగా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరిగాయని, నోట్ బుక్కులు కూడా 80 శాతం వరకు పంపిణీ అయ్యాయని మిగతా వాటిని కూడా జిల్లాకు కేటాయించిన వెంటనే విద్యార్థులకు ఆయా పాఠశాలల వారీగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక జత ఏకరూప దుస్తులు ఇప్పటికే విద్యార్థిని విద్యార్థులకు అందించామని, రెండవ జత యూనిఫామ్ లను మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కుట్టించి ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఈఓ అశోక్, ఎంఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పది టాపర్లను సన్మానించిన ఎమ్మెల్యేలు కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:జూన్ 30 (నేటి శుభోదయ): పదవ తరగతి 2024 - 2025 వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులను జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదివరకటితో పోలిస్తే ప్రభుత్వ బడులలో ఉత్తీర్ణత ఎంతో మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ప్రత్యేకించి ప్రభుత్వ బడుల నిర్వహణ మెరుగయ్యేలా మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని, తమ సొంత ఇంటిని తీర్చిదిద్దుకునే విధంగానే సర్కారీ బడులలో ప్రమాణాలు మెరుగుపడేలా చొరవ చూపాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని బడులలో విద్యార్థులు సంఖ్య గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. చక్కగా పనిచేసే వారిని తప్పనిసరిగా ప్రోత్సహిస్తామని, ప్రతి ఒక్కరు తమ విధులకు పూర్తి న్యాయం చేస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, విద్యా, క్రీడ, పర్యాటక రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో సౌకర్యాలు, విద్యా బోధన మెరుగుపడేలా కృషి చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సైతం ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీసుకునేలా తీర్చిదిద్దాలని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో సీఎం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారని అన్నారు. చాలాకాలం నుండి పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఇటీవలే ప్రభుత్వం పూర్తి చేసిందని గుర్తు చేశారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఇదివరకటి రెండు సంవత్సరాలలో పోలిస్తే, ఈసారి పదవ తరగతిలో జిల్లాలో సగటు ఉత్తీర్ణత మెరుగుపడిందని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల సాధన కోసం ఇప్పటినుండే నాణ్యమైన విద్యా బోధనపై దృష్టిని కేంద్రీకరించాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం వంటి సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులకు క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా వసతుల కొరత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఎస్సెస్సీలో మెరుగైన ఫలితాల సాధన, అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు, నాణ్యమైన విద్యా బోధన గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ఎస్సెస్సీలో 586 మార్కులు సాధించిన డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోట రక్షితను అభినందిస్తూ ముఖ్య అతిథులు సత్కరించారు. అలాగే, 584 మార్కులు సాధించిన ఓరగంటి గంగాగోపాల్, గట్టు షైనీ, 582 మార్కులు పొందిన ఎస్.దీప్తి, డి.వైశాలి, 579 మార్కులు సాధించిన వై.కీర్తన, 577 మార్కులు సాధించిన అలేఖ్య, వై.గ్రీష్మ, జంగిటి అక్షరలను ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పల్లికొండ, డొంకేశ్వర్, రాంపూర్, మెండోరా, అమ్రాద్, చౌట్పల్లి, జక్రాన్పల్లి, మోస్రా, కల్లెడి, రెంజల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. ప్రభుత్వ బడులలో అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన బోర్గం(పి) హైస్కూల్, బోధన్ రాకాసిపేట్ బాలికల ఉన్నత పాఠశాల, చిట్టాపూర్ ప్రైమరీ స్కూల్, తుంపల్లి ప్రైమరీ స్కూల్, ఫులాంగ్ బాలుర ఉచ్చతర ప్రాథమిక పాఠశాలల హెచ్.ఎంలను కూడా సత్కరించారు. సోమవారం నాటితో పదవీ విరమణ చేసిన ముగ్గురు ఎంఈఓలు, ముగ్గురు హెచ్.ఎం లను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఎం.ఈ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గజిటెడ్ హెచ్.ఎంలు, కాంప్లెక్ హెచ్.ఎంలు, ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేదలైన ఆర్యవైశ్యుల అభివృద్ధికి
### వాసవి అభయ నిధి
### అధ్యక్ష అభ్యర్థి అర్వపల్లి పురుషోత్తం గుప్తా



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: జూన్ 30 (నేటి శుభోదయ): ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షునిగా, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా సేవలందించిన తాను ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కోసం వాసవి అభయ నిధి తో ముందుకు వస్తున్నానని తన ప్యానల్ ను గెలిపించాలని ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్ష అభ్యర్థి అరవపల్లి పురుషోత్తం గుప్తా అన్నారు. సోమవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా తాను సంఘానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూలై ఆరవ తేదీన ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శివాజీ నగర్ లోని నూతన వైశ్య ఉన్నత పాఠశాల మాణిక్ భవన్ లో అధ్యక్ష, కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష అభ్యర్థి అర్వపల్లి పురుషోత్తం గుప్తా పేర్కొన్నారు. పట్టణం పట్టణంలోని ఆర్యవైశు ్యలంతా తనకు మద్దతు తెలిపి ఈ ఎన్నికల్లో శాశ్వత సభ్యులు తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పని చేసే వ్యక్తులను తమ ప్యానెల్ సభ్యులుగా ఉన్నారని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు తాము చేసేదే చెప్తామని చెప్పింది చేస్తామని అన్నారు తాము ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా 2001 నుంచి 2007 సంవత్సరం వరకు సేవలు అందించాలని, ఆ సమయంలోనే ఆర్యవైశ్యులకు ఒక కళ్యాణ మండపము ఉండాలని సంకల్పంతో తన సొంత నిధులతో ఒక ఎకరం స్థలంలో కళ్యాణమండప స్థలం విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు దాతల సహకారం కూడా తీసుకొని నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. బీద ఆర్యవైశ్య ఉత్తమ విద్యార్థుల ఉన్నత చదువులు ఆర్థిక లోటు రాకుండా చదువు మధ్యలో ఆగిపోకూడదని సంకల్పంతో తాను చైర్మన్ గా ఉంటూ ట్రస్ట్ ద్వారా కొందరి సహకారంతో శ్రీ వాసవి సేవా సమితి ఏర్పాటు చేసి సుమారు 5 లక్షల రూపాయల వరకు స్కాలర్షిప్ ఇవ్వడం జరిగిందన్నారు. 2023 2024 సంవత్సరంనకు గానూ జిల్లా ఆర్యవైశ్య మహాసభకు అధ్యక్షులుగా సేవలందించి జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లోని ఆర్యవైశ్య సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి రాజకీయంగా రాణించాలని ప్రభుత్వ కార్యదర్శిలను, వారి కార్యవర్గంను చైతన్యవంతులను చేశామన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాల్లో ఉన్న వారికి పెళ్లిళ్లు జరిపించడం జరిగిందన్నారు. వాసవి అభయనీతి ద్వారా వ్యాపారం చేసుకునే పేదలకు 50 పైసల మిత్తి తో రుణం అందజేయనున్నట్లు తెలిపారు. 20 శాతం డిస్కౌంట్ తో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం అందించనున్నామని, ప్రమాదంలో గాయపడి ఇబ్బందుల్లో ఉన్నవారికి 5 లక్షల వరకు, సుమారు 200 నుంచి 300 మందికి సహాయం చేయనున్నామన్నారు. సంఘం అభివృద్ధి కోసం ముందుకు వస్తున్న మాకు మరొకసారి ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఆర్య వైశ్యులు అవకాశం కల్పించి ఆర్యవైశ్యుల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. రాజకీయాలకతీతంగా సేవ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నామని, సంఘంలో రాజకీయా పార్టీలకు తావు లేదని, గెలిచిన తరువాత అన్ని పార్టీలను కలుపుకొని పోయి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాజకీయ కుటుంబంలో ఉన్న కొంతమంది వ్యక్తులు అన్ని పదవులు తమకే కావాలని చూస్తున్నారని, అలాంటివి జరగకుండా నిస్వార్థంగా పనిచేసే మాలాంటి వారికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చు పురుషోత్తం, నంగునూరు శ్రీనివాస్, సంతోష్ కుమార్, కట్కం సుభాష్, సంపత్ కుమార్, శ్రీనాథ్, శ్రీనివాస్, దేవరాజ్, సురేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, రాజమౌళి, అశోక్, కృష్ణ, శ్రీనివాస్, జయకృష్ణ, రాజేందర్, దేవేందర్, ప్రవీణ్ కుమార్, విజయ్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మచిలీపట్నంలో రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు మృతి



మచిలీపట్నం, జూన్ 30 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): మచిలీపట్నం లోని శారద నగర్ లో ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతూ డివైడర్ను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతులు చిన్నాపురం గ్రామానికి చెందిన దాలిపర్తి పవన్, కోడూరుకు చెందిన మరో యువకుడిగా గుర్తించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షునికి శుభాకాంక్షలు

### పెద్దపల్లి జిల్లా మాజి అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి



మంథని, జూన్-30 (నేటిశుభోదయ) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక నామినేషన్ పక్రియ పూర్తి అయి, ఏకగ్రీవంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు గా ఎనికైనా రాంచందర్రావు ను మర్యాద పూర్వకంగా కలసి శు భాకాంక్షలు తెలిపిన పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుముల్ల పోచం, తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి - కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: జూన్ 30 (నేటి శుభోదయ):ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 127 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీ.డీ.రాజేందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధర్మపురి శ్రీనివాస్ సేవలు మరువలేనివి

### నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: జూన్ 30 (నేటి శుభోదయ): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మాజీ పిసిసి అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు, నిజామాబాద్ జిల్లాకు చేసిన అభివృద్ధి, సేవలు మరువలేనివని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు.ఆదివారం డి శ్రీనివాస్ విగ్రహ ఆవిష్కరణ చేసిన విషయం తెలిసిందే. జిల్లా కాంగ్రెస్ పార్టీ, నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఆధ్వర్యంలో సోమవారం రోజున ధర్మపురి శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ధర్మపురి శ్రీనివాస్ స్వర్గస్తులైనప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ కు వచ్చి డి శ్రీనివాస్ పైన కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పినట్టు గుర్తు చేశారు. తెలంగాణ పిసిసి అధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడిగా రాష్ట్రానికి, జిల్లాకు, కాంగ్రెస్ పార్టీకి ఎంతో కృషి చేశారాని అన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ శోకసముద్రంలో ఉన్నప్పుడు సిఎం రేవంత్ రెడ్డి వచ్చి డి శ్రీనివాస్ కుటుంబాన్ని ఓదార్చారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని విన్నవించుకోగా, రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు డి శ్రీనివాస్ తో సన్నిహితం ఏర్పడ్డాయని అన్నారు. ఆయన చాలా సున్నితమైన మనిషి అని, ఆయన సిద్ధాంతాలను, ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులుగా ఉండి కాంగ్రెస్ పార్టీకి దిశ నిర్దేశం చేశారని, రాజనీతి అనుభవజ్ఞుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, సహకార కార్పొరేషన్ చైర్మన్, డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఏం సి సి చైర్మన్ ముప్పగంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, శరత్, ఐ సి డి ఎం ఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, డిసిసి డెలికేట్ ధర్మ గౌడ్, రూరల్ యూత్ నాయకులు ఉమ్మాజీ నరేష్, నిజాంబాద్ రూరల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, వివిధ గ్రామల గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయానిది పేదలకు వరం

### మహమ్మద్ షబ్బీర్ అలీ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: జూన్ 30 (నేటి శు భోదయ): నిజామాబాద్ పట్టణంలోని ఆర్,-బి గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి 27 చెక్కులను దాదాపు 16లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరమని,నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోనీ పలు కాలనీల లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగింది అన్నారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు.పేదలకు సహాయంగా అండగా నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందిస్తామన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నాం. రుణమాఫీ చేసి చూపించాం, రైతు భరోసా అందిస్తున్నాం, మహిళలకు ఉచిత బస్సు,500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అన్నారు.రాజీవ్ యువ వికాసం పథకముద్వర నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ కేశ వేణు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కంజర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: జూన్ 30 (నేటి శు భోదయ): మోపాల్ మండలం కంజర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపట్టిన పనుల గురించి ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ. 11.20 లక్షల నిధులు మంజూరు కాగా, తాగునీటి వసతి, విద్యుత్, ఫ్లోరింగ్ తదితర ప్రతిపాదిత పనులన్నీ పూర్తి అయ్యాయని హెచ్.ఎం గోపాలచారి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా వసతులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ అశోక్, ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.

## జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

### నూతన గ్రామ కమిటీల ఏర్పాటు - ఎమ్మార్పీఎస్ జెండా గద్దేల ఏర్పాటు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:జూన్ 30 (నేటి శుభోదయ): నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలం తాటిపల్లి,జినిగాల గ్రామాలలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్చార్జ్ కుడాల స్వామి ఎం.ఆర్.పి.ఎస్ సిరికొండ మండల అధ్యక్షులు మొట్టల దీపక్, తాటిపల్లి గ్రామ మాదిగ పెద్దలతో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో సాధించుకున్న విజయాలు, పోరాటాలు ఇప్పుడిప్పుడే సాధించుకున్న ఏబీసీ వర్గీకరణ విషయమై మాదిగ పెద్దలతో చర్చించి వారికి అవగాహన కల్పించి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జెండా దిమ్మె నిర్మించి జులై 7 న దండోరా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జండా ఎగరేసి సంబరాలు జరుపుకోవాలని కోరడం జరిగింది. దీనికిగాను తాటిపల్లి,జినిగ్యాల గ్రామ మాదిగ పెద్దలు ఆమోదం తెలిపి నూతన గద్దె నిర్మాణం చేపట్టి జులై 7 న ఆవిర్భావ దినోత్సవ సంబరాలు జరుపుకుంటామని తెలిపినారు.ఎమ్మార్పీఎస్ తాటిపల్లి జినిగాల గ్రామ కమిటీ వేయడం జరిగింది. కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ ధర్పల్లి ఇన్ఛార్జ్ నక్కా రాజేందర్ మాదిగ, తాటిపల్లి జినిగాల మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్టిసి సేవలకు గౌరవం ముగ్గురు ఉద్యోగులకు ఘన సన్మానం




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్:జూన్ 30(నేటి శుభోదయ): నిజామాబాద్ ఆర్టిసి డిపోలో సుదీర్ఘకాలం సేవలందించిన ముగ్గురు ఉద్యోగులు ఎ మొహమ్మద్ నసీరుద్దీన్, ఎన్. లక్ష్మణ్ గౌడ్, టీ. నాగేశ్వర్లు సోమవారం ఘనంగా పదవీ విరమణ పొందారు. విధులకు ఎల్లప్పుడు నిష్ట, నిజాయితీతో భాధ్యతల్ని నిర్వర్తించినందుకు వీరిని డిపో మేనేజర్ ఎస్. ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సహచరులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. "ఆర్టిసి కు మీరు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. రిటైరైన తర్వాత మీరు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించండి" అని అందరూ హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు అడిగితే కాంగ్రెస్ నుంచి బహిష్కరణ




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: జూన్ 30 (నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ, పేదల ముఖాల్లో సంతోషం చూడటమే లక్ష్యంగా పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని ఆటోనగర్, నాందేవ్ వాడ, సీఎం రోడ్, టెలిఫోన్ కాలనీ, గోశాల, సతీష్ నగర్ ప్రాంతాల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో డివిజన్ 28, 29, 30లకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రాసెసింగ్ కాపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇళ్లు పేదల హక్కు. వీటిపై ఎవరూ చేతులు వేసే అధికారం లేదు. కాంగ్రెస్ నాయకులు గాని, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు గాని డబ్బులు అడిగితే, వారిని తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తాం. ఇలాంటి విషయాల్లో ఎటువంటి సందేహం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటాం," అని గట్టి హెచ్చరిక చేశారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 4 లక్షల 50 వేల ఇండ్లను మంజూరు చేయగా, ప్రతి నియోజకవర్గానికి సగటున 3,500 ఇళ్లు కేటాయించామని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,300 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని, త్వరలో మరియు 2,200 మందిని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు ప్రధాన హామీలను క్రమంగా అమలు చేస్తూనే, ఎన్నికల సమయంలో ప్రకటించని పథకాలను కూడా కొనసాగిస్తోందని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ఎఫ్ చెక్కులు వంటి పథకాలతో పేదల జీవితానికి ఆర్థిక భారం తగ్గిందని వివరించారు. ఈ కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జావేద్ అక్రమ్, సమీ, హారూన్, పాప ఖాన్ తదితరులు పాల్గొన్నారు.






## బ్లడ్ బ్యాంక్ లను తనిఖీ చేసిన

### వైద్య ఆరోగ్యశాఖ బృందం










**ఖమ్మం,(నేటి శుభోదయ):** జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతి బాయి,డ్రగ్ ఇన్స్పెక్టర్ అరవింద్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సిటీలోని పలు బ్లడ్ బ్యాంకులను తనిఖీ చేశారు. తొలుత నోవా కేర్ బ్యాంకు తో పాటుగా మరికొన్నింటిని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బ్లడ్ బ్యాంకు అనుమతులను,నిర్వహణ రిజిస్టర్, సిబ్బంది వివరాలు, బ్లడ్ తీసే విధానాన్ని,నిల్వ చేసే విధానాన్ని పరిశీలించారు. తలసేమియా రోగులకు అందిస్తున్న బ్లడ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుర బ్లడ్ బ్యాంకు తనిఖీ లో బ్లడ్ నిల్వలు వేరే చోట గదిలో నిల్వ చేయడాన్ని గుర్తించడంపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సైదులు, బ్లడ్ బ్యాంకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట రమణ, డిప్యూటీ డెమో జి.సాంబ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకంటే ఎక్కువ ఎవరూ కాదు..

## రాజా సింగ్ విషయంలో బీజేపీ కీలక ప్రకటన..!

**హైదరాబాద్, :** బీజేపీ పార్టీ ఎమ్మెల్యే రాజా సింగ్ విషయంలో తెలంగాణ బీజేపీ పార్టీ కీలక ప్రకటన చేసింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ క్రమశిక్షణారాహిత్యం పరాకాష్ఠకు చేరిందని, రాష్ట్ర పార్టీ అధ్యక్ష ఎన్నికలలో రాజాసింగ్ కూడా నామినేషన్ వేస్తానని పార్టీ కార్యాలయానికి వచ్చారని తెలిపింది. ఆ సమయంలో విషయమై జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్ రాజాసింగ్ చర్చించారు. ఇక రాజాసింగ్ కోరిక మేరకు నామినేషన్ పత్రాలు ఇచ్చి నామినేషన్ వేసుకునే అవకాశం ఇచ్చారని తెలిపింది. అలాగే రాష్ట్ర ఎన్నికల అధికార శోభా కరంద్లాజేకి 10 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల మద్దతుతో నామినేషన్ ఫామ్ సమర్పించవలిసి ఉండగా, వారు కేవలం ముగ్గురు సభ్యుల సంతకాలతో ఉన్న ఫామ్ మాత్రమే సమర్పించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధన ప్రకారం.. రాష్ట్ర అధ్యక్షుని ఎన్నికలలో పోటీ చేయడానికి 10 మంది స్టేట్ కౌన్సిల్ సభ్యుల సంతకాలతో మరో ఫామ్ సమర్పించవలిసిందిగా శ్రీమతి శోభా కరంద్లాజే రాజాసింగ్ కోరారు. అయితే, రాజాసింగ్ నామినేషన్ కి మద్దతిచ్చే స్టేట్ కౌన్సిల్ సభ్యులు లేక చేతులెత్తేసి పార్టీ పోటీ చేయనివ్వట్లేదని అబద్ధాలతో పార్టీపై అభాండాలు వేస్తున్నట్లు తెలిపింది. పార్టీ అధ్యక్షులు శ్రీ కిషన్ రెడ్డికి సమర్పించిన రాజీనామా పత్రాన్ని ఆయన జాతీయ అధ్యక్షుడికి పంపించడం జరుగుతుందని తెలిపింది. రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్ కు రాజీనామా లేఖ సమర్పించాలని, పార్టీకంటే ఎక్కువ ఎవరూ కాదని బీజేపీ పార్టీ పేర్కొంది. గతంలో కూడా ఇలాంటి క్రమశిక్షణారాహిత్య వ్యవహారాలతో సస్పెండ్ అయితే మళ్లీ పార్టీలోకి తీసుకున్నామని.. ప్రధానమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు వారి నియోజకవర్గానికి వచ్చినా సరే వారి కార్యక్రమాలకు హాజరుకాకుండా పార్టీ కంటే తానే సుప్రీం అన్నట్లుగా ఉంది రాజాసింగ్ వ్యవహారమని పార్టీ తెలిపింది. మా పార్టీకి వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం. పార్టీ క్రమశిక్షణను అనేకసార్లు రాజాసింగ్ ఉల్లంఘించినట్లు తెలిపింది. చివరకు ఈరోజు వారే రాజీనామా చేసారని పార్టీ ప్రకటించింది.

## లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం.. మరో ఇద్దరి అరెస్ట్..!

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్లో పొలిటికల్ హీట్ పెంచుతున్న ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి..ఈ కేసులో నిందితులుగా ఉన్న బాలాజీ, నవీన్లను అదుపులోకి తీసుకున్నారు సిట్ పోలీసులు.. ఎన్నికల సమయంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్కి రూ.8.20 కోట్ల రూపాయలు తరలించినట్టు బాలాజీపై ఆరోపణలు ఉండగా.. ఇండోర్ లో బాలాజీని అదుపులోకి తీసుకున్నారు సిట్ పోలీసులు.. బాలాజీ లొకేషన్ ఆధారంగా ఇండోర్ వెళ్లిన సిట్ బృందం.. అతడిని పట్టుకుంది.. ఇక బాలాజీతో పాటు నవీన్ను కూడా అదుపులోకి తీసుకుంది.. ఆ ఇద్దరు నిందితులను ఇండోర్ నుంచి విజయవాడ తరలిస్తున్నారు సిట్ అధికారులు.. కాగా, లిక్కర్ కేసులో సిట్ అధికారులు దూకుడు చూపిస్తున్నారు.. ఇతర రాష్ట్రాలతో పాటు.. ఇతర దేశాల్లో ఉన్నవారిని కూడా అరెస్ట్ చేయడంపై దృష్టి సారించారు.. ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితులు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా.. విదేశాల్లో ఉన్న లింక్ లపై కూడా ఫోకస్ పెట్టారు సిట్ అధికారులు.. మరోవైపు, తాజాగా అరెస్ట్ అయిన నిందితులను మరింత లోతుగా ప్రశ్నించేందుకు సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారు.. దీని కోసం కోర్టుల అనుమతి తీసుకుంటున్నారు..

## కర్ణాటకలో సీఎం మార్పు పుకార్లు.. ఖర్గే సంచలన వ్యాఖ్యలు..!

**న్యూఢిల్లీ,:** కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై పార్టీ హైకమాండ్కు చర్య తీసుకునే అధికారం ఉందని స్పష్టం చేశారు. అక్టోబర్లో ముఖ్యమంత్రి మార్పుపై రాష్ట్రంలో ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఈ అంశాన్ని తాజాగా మీడియా ప్రతినిధులు ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి మార్పు నిర్ణయం పార్టీ హైకమాండ్ చేతిలో ఉంది. హైకమాండ్లో ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఈ నిర్ణయాన్ని హైకమాండ్కే వదిలేయాలి. కానీ ఎవరూ అనవసరంగా సమస్యలు సృష్టించడానికి ప్రతయత్నించకూడదు." అని ఖర్గే వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పు జరుగుతుందనే ఊహాగానాల మధ్య. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన "హైకమాండ్" వ్యాఖ్యపై బీజేపీ వ్యాంగంగా స్పందించింది. ఖర్గే కాకపోతే "పార్టీ హైకమాండ్" ఎవరు అని యంగ్ ఎంపీ తేజస్వీ సూర్య ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చాలా వింతగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ఫాంలో ఓ పోస్ట్ చేశారు. "కాంగ్రెస్ హైకమాండ్ రూపురేఖలు లేనిది. అది ఎవరికీ కనిపించదు, వినిపించదు. కానీ అది ఉన్నట్లు అందరూ అనుభూతి చెందుతారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ అధిష్ఠానం అని ప్రజలు భావిస్తున్న పార్టీ అధ్యక్షుడు కూడా అది తాను కానని అంటున్నారు" అని రాసుకొచ్చారు. కాగా.. ఇప్పటికే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనకు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కు మధ్య విభేదాలు ఉన్నాయనే పుకార్లను తోసిపుచ్చారు. " డీకే శివకుమార్, నేను కలిసే ఉన్నాం. ఈ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు శిలలాగా చెక్కుచెదరకుండా ఉంటుంది. బీజేపీ అబద్ధాలకు పేరుగాంచింది. వాళ్లు చేసే వ్యాఖ్యలపై మేము స్పందించము." అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు.

## పాశమైలారం ఘటనపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, :** పటాన్చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సోమవారం ఉదయం జరిగిన భారీ పేలుడు ఘటన రాష్ట్రాన్ని షాక్కు గురిచేసింది. ఈ ఘోర ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంటల ధాటికి పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం విచారం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అధికారికంగా చేసిన ప్రకటనలో.."పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో పలువురు మరణించడం కలచివేసింది. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఆదేశాలు సంబంధిత అధికారులకు ఇచ్చాను. ప్రభుత్వంగా మేము బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం" అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. పాశమైలారం ఘటనపై అధికారులు సంపూర్ణ నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 10 మంది మృతి చెందగా, మరెందరో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైన స్థితిలో ఉండగా, రెస్క్యూ చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

# బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం..!



**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరోమారు బీసీల గురించి చర్చను లేవనెత్తారు. తాజాగా మంత్రి బీసీల విషయమై స్పందిస్తూ.. బీజేపీ పార్టీ బీసీల వ్యతిరేకని మరోసారి నిరూపించుకుందని అన్నారు. ముగ్గురు బీసీ ఎంపీలు ఉన్నా.. అలాగే అనేకమంది బీసీ సీనియర్ నేతలు ఉన్నా సరే.., అలాగే బీజేపీ అధ్యక్షుడు కావడానికి అన్ని అర్హతలు ఉన్న ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో బీసీ ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి కనీసం సభాపక్ష నాయకుడుని కూడా బీసీలకు ఇవ్వలేదని ఆగ్రహించారు. అంతే కాకుండా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఓ ఫ్యూడల్ పార్టీ. బీజేపీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరగలేదు. బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వెయ్యనివ్వకుండా అడ్డుకొని నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీజేపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందని మీ పార్టీ నాయకులే వాపోతున్నారు.. దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఇకపోతే, సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి రెడ్డి ఉంటే, టీపీసీసీ అధ్యక్షుడిని బీసీని చేసుకున్నామన్నారు. మేము ఒకవైపు కుల గణన చేసుకొని బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ శాసన సభలో చట్టం చేసుకొని సామాజిక న్యాయం కోసం ముందుకుపోతుంటే.. బీజేపీ మరోసారి బీసీల గొంతు కోసిందని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల కోసం నినాదాన్ని ఎత్తుకున్నారన్నారు. తెలంగాణలో దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు న్యాయం జరిగేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అంటూ తెలియచేశారు. గతంలో బీజేపీ అధ్యక్షుడు బీసీ నేత బండి సంజయ్ ఉంటే ఎన్నికల సమయంలో ఆయనను తొలగించి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేసారని గుర్తు చేశారు.

# కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ అధ్యక్ష ఎంపిక.. ప్రభుత్వ విప్ సంచలన వ్యాఖ్యలు..!



**హైదరాబాద్, :** రాష్ట్ర రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరలేపుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై బీఆర్ఎస్, బీజేపీ మైత్రి మరోసారి బయటపడిందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగిందని ఆయన మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీకి "అవయవ దానం" చేసిందని వ్యాఖ్యానించారు. తాజాగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు లాంటి బలహీన వ్యక్తిని నియమించడం కూడా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సాయం చేసే వ్యూహం భాగమని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం కేసీఆర్ డైరెక్షన్‌లో జరిగిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వర్గాలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని బీర్ల ఐలయ్య విమర్శించారు. గతంలో ఎన్నికల ముందు బండి సంజయ్ ను బీజేపీ అధ్యక్ష పదవి నుండి తప్పించడమూ, ఇప్పుడు మళ్లీ బీసీలకు కాకుండా అగ్రవర్ణాల నేతకు పదవి కట్టబెట్టడమూ దానికి ఉదాహరణలని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు లు ఢిల్లీలో అర్ధరాత్రి బీజేపీ నేతలతో సమావేశాలు జరిపి అగ్రవర్ణాల నేతను అధ్యక్షుడిగా నియమించేలా లాబీ చేసినట్లు బీర్ల ఐలయ్య ఆరోపించారు. ఈ చర్యలన్నీ బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఒప్పందాన్ని బలపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇక రాష్ట్ర బీజేపీ పార్టీలోని కీలక వ్యక్తి రాజసింగ్ కూడా బీజేపీకి రాజీనామా చేయడాన్ని బీర్ల ఐలయ్య ప్రస్తావించారు. ఇది బీజేపీ పార్టీ ఆత్మ స్థితిగతులపై ప్రజలకు సంకేతం ఇచ్చే విషయమని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రాణం పోసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు.

# బీహార్ ఎన్నికల్లో పోటీపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,:** త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాదిలోపు బీహార్ ఎన్నికలు ముగియనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇక అన్ని పార్టీలు కదనరంగంలోకి దిగాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ప్రధానంగా యువత ఓట్లే కీలకం. దీంతో ఇప్పటికే యువ నేతలు తేజస్వి యాదవ్, కన్హయ్యకుమార్, ప్రశాంత్ కిషోర్ లాంటివాళ్లు పొలిటికల్ యుద్ధంలోకి దిగారు. తమ సత్తాను నిరూపించుకునేందుకు ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా లోక్ జనశక్తి పార్టీ నేత, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారు. ఒక జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను కూడా పోటీ చేస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. కచ్చితంగా పోటీ చేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ఫైనల్‌గా పార్టీ నిర్ణయమే తుది నిర్ణయంగా చెప్పుకొచ్చారు. తనకైతే పోటీ చేయాలనే ఉందని.. చివరిగా పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలన్నారు. ప్రస్తుతం లోక్ జనశక్తి పార్టీ ఎన్డీఏ కూటమిలో ఉంది. మోడీ కేబినెట్‌లో చిరాగ్ పాశ్వాన్ మంత్రిగా ఉన్నారు. మరోసారి అధికారం కోసం నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రయత్నాలు చేస్తోంది. ఇంకోవైపు ఆర్జేడీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి కూడా అధికారం కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా తమకు అధికారం కట్టబడితే.. నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. బీహార్ ప్రజలు ఈసారి ఏ పార్టీకి అధికారం కట్టబెడతారో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

# అధిష్ఠానం ఇంకా రాష్ట్ర అధ్యక్షుడిని ఇంకా ప్రకటించలేదు

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ నేపథ్యంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టతనిచ్చారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయంపై అనవసర చర్చలు, విమర్శలు అర్థహీనమని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఒక కట్టర్ కేడర్‌తో కూడిన పార్టీ అని, రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలో అధిష్ఠానం అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందన్నారు బండి సంజయ్. అధికారం కోసం కాదు, దేశం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని. ఎవరు అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలన్నది అడగొచ్చు కానీ, నిర్ణయం మాత్రం అధిష్ఠానమే తీసుకుంటుంది అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ తీర్పును గౌరవించకుండా, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం సహించేది కాదు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని ఆయన పేర్కొన్నారు. ఇక, బీజేపీ బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వదని బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను బండి సంజయ్ ఖండించారు. "గతంలో నాకు, లక్ష్మణ్‌గారికి రాష్ట్ర అధ్యక్ష పదవిని ఇచ్చిన పార్టీ ఇదే బీజేపీ. బిఆర్ఎస్ వాళ్లు నిజంగా బీసీలకు న్యాయం చేయాలనుకుంటే, వారే బీసీలకు తమ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. "ఇక్కడ చంద్రబాబు నాయుడు ఎవరిని సూచించారన్నది సంబంధం లేదు. బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీ వ్యూహాల ప్రకారమే ఉంటుంది. ఎవరు డమ్మీలు కాదు.. ఎవరిని ఎక్కడ వినియోగించాలో పార్టీకి బాగా తెలుసు" అని స్పష్టం చేశారు.

# రైతు రాజయ్యేదెన్నడు?

రైతు లేనిదే రాజ్యం లేదు, అన్నదాతే దేశానికి వెన్నెముక. జై కిసాన్ అంటూ ఉపన్యాసాన్ని దంచికొట్టే పాలకుల తీరును చూస్తే 'మాటలు కోటలు దాటుతున్నాయి-చేతలే తంగేళ్లు దాటడం లేదు" అన్నట్టుగా ఉంది. నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు,గౌరవం ఇస్తు న్నామా?ఒక్కసారి పరిశీలిం చుకోవాల్సిన అవసరం ఉన్నది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. కారణం, పాలకుల చేతగానితనం, నిర్లక్ష్యపు వైఖరి. అదేస్థాయిలో పారిశ్రామిక, సాంకేతిక, సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతు న్నాయి.



ఎందుకు? ఇందులో పెట్టుబడి దారుల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీఏవి)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా బాగా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే వ్యవసాయ రంగం మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే"అన్న చందంగా కునారిల్లుతోంది. రైతు ఆత్మహత్యలను ఆపలేక పోవడం పాలకుల తీవ్రమైన వైఫల్యం. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడు తున్న సాగును బాగుచేయడం పక్కనపెడితే, కనీసం ఆత్మ హత్యలనైనా నివారించాలి కదా! ప్రభుత్వం పెట్టిన పథకాలను నమ్ముకుని చాలామంది వ్యవసాయం వైపు మరిలారు. కానీ ఇక్కడ పెట్టుబడి రెండింత లైతే దిగుబడి అంతకన్నా తక్కువగా ఉంటున్నది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేలా వెన్నంటే ఉండాల్సిన ప్రభుత్వం పత్తకు కూడా లేదన్నది వాస్తవం. దీనికితోడు వ్యవసాయంపై పర్యవేక్షణ కూడా రోజురోజూకూ కొరవడుతోంది. ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని, రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది.అలానే జూన్ మొదట్లో తొలకరి మురిపించింది.ఆ తర్వాత జూన్ నెలాఖరు వస్తున్నా



ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడటం లేదు.తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితి ఇన్నేండ్లయినా మారలేదు. అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. తొలకరి వానలకు ముందుగా నాలుగుసార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతాడు. మొక్క మొలకెత్తింది మొదలు దాన్ని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపుతీస్తాడు, మందులు వేస్తాడు. పంట చేతికందే సరికి అతివృష్టో లేదా అనావృష్టో ఆ పైరు ఎండిపోవడమో, కొట్టుక పోవడమో జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగి రాని దయనీయ స్థితిలో రైతు ఉంటాడు. అలాంటి సమయంలో నిరాశ నిస్పృహకు లోనై, చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడు తుంటాడు. ఈ సమయంలో ప్రభుత్వం గనుక ఆదుకుంటే ఏ సమస్య ఉండదు. రైతు కుటుంబం బాగుపడుతుంది. కానీ ప్రకృతి వైపరీత్యాలకు పాలకులు బాధ్యత వహించడం లేదు. ఏదైనా చేద్దామనుకున్నా కంటితుడుపు సాయం ప్రకటిస్తారు. రైతు పూర్తికాలం వ్యవసాయం రంగంలో బతకాలంటే ఇది ఏ మాత్రం సరిపోదు. వ్యవసాయం అంటే పండినా, పండక పోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకు సాగే పరిస్థితి రావాలి. తరతరాలుగా చూస్తున్నా పాలకుల్లో వారిని బాగుపరిచే ఆలోచన రావడం లేదు. మన దేశంలో సాగు రంగంలో దండుగ! పండుగ రెండూ ఉంటాయి. ఈ రంగంలో ఒక యేడు పండితే? మరో యేడు పండదు.అయినా పండలేదని రైతు కాడి,మేడి వదిలేస్తే.. అందరికీ ఆహారం ఎలా?.ప్రకఅతి విపత్తులకు తోడు పాలకుల ఉదాసీనత, వ్యాపా(దళా)రుల దోపిడీ, నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులు, నాణ్యతలేని ఎరువులు ఇలా అనేక విధాలుగా అష్ట కష్టాలైనా అనుభవిస్తూ, అధిగమిస్తూ పంట పండిస్తారు రైతులు. చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు ఉండదు. అయినా వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు ప్రకృతి మీద భారమేసి మళ్లీ సాగు మొదలుపెడతాడు. ఇందు లో అన్నదాతకు సహకరించేది అంతో ఇంతోఉందంటే అది ప్రకృతి తప్ప ప్రభుత్వం కాదు! అందుకే రైతుల పట్ల పాలకుల బాధ్యత పెరగాలి. దేశంలో సాగు రంగాన్ని తరతరా లుగా పట్టిపీడి స్తున్న ఆత్మహత్యల సామాజిక రుగ్మతను తరిమే యాలి. సాగులో నష్టాలు వచ్చినా, వారికి ఆర్థిక సహాయం అందించాలి. అన్న దాతల కుటుం బాల్ని కాపాడు కోవాలి.అప్పుడే రైతు రాజవుతాడు. అప్పటివరకు తన చేలో ఒక కూలీగానే ఉంటాడన్న సంగతి పాలకులు

# వికసిత భారత్ ఆవిష్కరణ ఎలా?



భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిం చాలనేది అందరి సంకల్పం. అదే అంతిమ లక్ష్యం. 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో మన దేశం ఎన్నో విజయాలను సాధించింది. ఎన్నో మైలురాళ్లను నెలకొల్పింది. అదే సమయంలో నేటికీ మన దేశం అనేక రంగాల్లో వెనుకబడి ఉంది. ఎన్నో లోటుపాట్లున్నాయి. మనకంటే చిన్న దేశాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. సమూల మార్పులతో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికతోనే దేశం పురోగమిస్తుంది. దేశ స్థూల జాతీయోత్పత్తి 4.18 ట్రిలియన్ డాలర్లకు చేరి.. మనదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే భారత్ కంటే ముందు ఉన్నాయి. అయితే ఈ దేశం ఈ ఘనత సాధించినప్పటికీ ఇంకా 24 కోట్ల మంది పేదరికంలోనే ఉన్నారు.. 11.8 శాతం మందికి పౌష్టికాహారం అందడం లేదు. 11.3 శాతం మందికి తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు అందు బాటులో లేవు. 13.9 శాతం జనాభాకు వంటగ్యాస్ అందు బాటులో లేదు. 13.6 శాతం మందికి ఇళ్లు లేవు. పేదలకు వైద్యసేవలు పెనుభారంగా మారాయి. ప్రజలు తమ 10 శాతం ఆదాయాన్ని వైద్యపరంగా వెచ్చించే దుస్థితి దేశంలో ఉంది. విద్య సైతం వ్యాపారంగా మారింది.

## నిరుద్యోగం ఓ పెనుభూతం

దేశానికి అతిపెద్ద సమస్యగా, దీర్ఘకాలిక ఆర్థిక సవాలుగా నిరుద్యోగం ఉంది. ఇది ఆదాయం, వృద్ధి, జీవన నాణ్యతను ప్రభావితం చేస్తోంది. పనిచేయడానికి సిద్ధంగా ఉన్నవారికి ఉద్యోగాలు లభించకపోవడం ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రస్తుత నిరుద్యోగిత రేటు 4.9 శాతంగా ఉంది. 15 నుంచి 29 సంవత్సరాల యువతలో 17 శాతం మందికి ఎలాంటి ఉద్యోగాలు లేవు.. చైనా, జపాన్, మలేసియా, సింగపూర్ వంటి దేశాలు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడం వల్ల అక్కడ నిరుద్యోగం సమస్య కాలేదు.. చైనాలో బాలలకు ఆరో ఏట నుంచే ఉపాధి ఆధారిత విద్యాబోధన చేపట్టడం ద్వారా ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా ఉంది. మన దేశంలో ఇప్పటికీ పాలకులు ఈ వైపుగా దృష్టి సారించడం లేదు.. డిగ్రీ తర్వాతే ఉద్యోగం అనే భావనే దేశంలో ఉంది. సింగపూర్, మలేసియా దేశాలకు ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు వరంగా మారాయి. 80 శాతం ఉపాధి వాటి ద్వారానే కలుగు తోంది. నైపుణ్యాభివృద్ధి ప్రతీ విద్యార్థి అవసరంగా గుర్తించే ప్రక్రియను ఇంకా మన దేశంలో చేపట్టనేలేదు.

## ఉద్యోగాల భర్తీ ఎలా సాధ్యమంటే..?

మన రాష్ట్రంలో, మన దేశంలో ప్రధాన సమస్య నిరుద్యోగం. ఈ ఆర్థిక సామాజిక సమస్యని పరిష్కరించాలంటే ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన కార్యక్రమాన్ని చేపట్టాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగుల్లో ఇంతవరకు కేవలం పదకొండు వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చింది. ఇప్పటికీ ఇంకా రెండు లక్షల ఉద్యోగాలకు పైగా ఖాళీలు ఉన్నాయి.. అయిదేళ్లలో మొత్తం అయిదు లక్షల ఉద్యోగాల కల్పన చేయవచ్చు. రెండు లక్షల మంది ఉద్యోగులు పదవీ విరమణ అవుతారు.. ఈ ఖాళీలను గానీ పూరించగలిగితే, మిగిలిన ఒక లక్ష ఉద్యోగాలు కల్పించడం సమస్య కాదు. ప్రైవేటు రంగంలో పది లక్షల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఇలా మొత్తం పదిహేను లక్షల ఉద్యోగ కల్పన చేయాలి. ప్రస్తుతం మన దేశంలో ప్రతి వెయ్యి మందిలో పదిహేను మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరుగుతుంది. దీన్ని ముప్పైకి పెంచితే నిరుద్యోగ సమస్య సులభంగా తీరుతుంది.

## మౌలిక వసతుల లోపం..

మౌలిక వసతుల లేమితో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 18 శాతం గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. ప్రజా రవాణా సౌలభ్యం 68 శాతం మందికే అందు బాటులో ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ప్రజలు ఆసుపత్రులు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు.. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నా ఓడ రేవులు అక్కడక్కడే ఉన్నాయి. వైమానిక రంగంలోనూ వెనకబాటు కనిపిస్తోంది. అమెరికాలో 5170 విమానాశ్రయాలు ఉంటే మన దేశంలో 487 మాత్రమే ఉన్నాయి. దేశమంతటా తాతల కాలం నాటి రైల్వే లైన్లే ఇప్పటికీ ఉన్నాయి. కొత్త రైళ్ల నిర్మాణం అరుదుగా మారింది. స్టేషన్లను నవీకరిస్తూ మార్గాల విస్తరణను విస్మరిస్తున్నారు. దేశంలోని సహజ వనరుల వినియోగం అతి తక్కువగా ఉంది.

## వ్యవసాయ, అనుబంధ రంగాల్లో...

వ్యవసాయం దేశానికి జీవనాడిగా ఉన్నా అది పెను సవాళ్లు ఎదుర్కొంటోంది. ఆహార భద్రతను కల్పించే అన్నదాతలకు భరోసా లేదు. పెట్టుబడులకు అనుగుణంగా రాబడులు లేవు. రెట్టింపు ఆదాయం కల్పిస్తామని పాలకులు చెబుతున్నా కనీస ఆదాయం కలగానే ఉంది. మార్కెటింగ్ విధానం లోపభూయిష్టంగా మారింది. రైతుకు, వినియోగదారులకు మధ్య దళారీ వ్యవస్థ ప్రబలంగా పాతుకుపోయింది. పశుపోషణ, మత్స్య రంగం వంటివి ప్రగతికి దూరంగా ఉన్నాయి.

## ముందడుగు ఎలా?

2047 నాటికి అగ్రగామి దేశంగా అవతరించాలంటే సమూల మార్పులతో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికతోనే దేశం పురోగమిస్తుంది. దేశవ్యాప్తంగా ఉచిత విద్య, వైద్యం అందించాలి. చిన్ననాటి నుంచే శిక్షణ, నైపుణ్యాల అవపోసన ద్వారా మానవ వనరుల సత్వర వినియోగంతో నిరుద్యోగ నివారణకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. దేశంలో ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలను కల్పించాలి. మౌలిక సదుపాయాలను ఏకీకృతం చేయడం, సామాజిక సంక్షేమ పథకాలను విస్తరించడం, ఆర్థిక వృద్ధిని నడిపించడం, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడం వంటివి లక్ష్యాలు కావాలి. ప్రస్తుత విధానాలు కొనసాగితే వికసిత భారత్ లక్ష్యాలు చేరడం అసాధ్యమే.

# బనకచర్ల పాపం..ఎవరిది?



నీళ్లు, నిధులు, నియామకాల కోసం.. కొట్లాడి ఎన్నో త్యాగాలు, వేలమంది యువకుల ప్రాణ త్యాగాలతో స్వరాష్ట్రంలో అవి తెచ్చుకుందామనుకుందాం. కానీ రాష్ట్రం ఏర్పాటయ్యాక సరిగ్గా పదేళ్లకే మళ్లీ అదే నీటి కోసం తెలంగాణ ప్రజల గుండె వెచ్చవుతోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం చేపట్టాలనుకుంటున్న బనకచర్ల ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి గోదావరి మీద ఆధిక్యత గల్లంతవుతుంది. గోదావరిపై భవిష్యత్తులో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా పోతుంది. ఇది కేవలం ఒక నీటి ప్రాజెక్టు కాదు, తెలంగాణ భవిష్యత్ సాగుకు చిరకాల గాయం. బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టులో భాగంగా ఉంది. ఇది కేవలం ఓ హెడ్ రెగ్యులేటర్ పేరు కాదు.. ఇది గోదావరి నీటిని దోచుకునేందుకు రూపొందించిన ఓ రాష్ట్ర వ్యూహం. ఆ ప్రభుత్వం గోదావరి జలాల్ని పోలవరం ప్రాజెక్టు ద్వారా బొల్లపల్లి రిజర్వాయర్‌కి తరలించి, అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం ప్రాంతాలకు మళ్లించి అక్కడి కరువు సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

## పునాది వేసింది కేసీఆరే...

ఆంధ్రప్రదేశ్ రూ. 84,000 కోట్లతో చేపట్టబోయే బనకచర్లకు పునాది వేసింది కేసీఆర్, హరీశ్ రావేనని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు.. గోదావరి, కృష్ణా నదీ జలాలకు సంబంధించి 2016 ఫిబ్రవరి 21న ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నీటి పారుదల శాఖ మంత్రులు పాల్గొన్నారు. అయితే ఆ సమావేశం మినిట్స్‌కు సంబంధించి ఎనిమిది పేజీల్లోని ఆరో పేజీలో 'గోదావరి నుంచి ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్ మీద నిర్మించాల్సిన ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీలు అవసరం.. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు గోదావరి జలాలను తరలించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు' అని కేసీఆర్ ప్రతిపాదించిన విషయం బయటకు తెలిసింది. ఆ సమావేశంలో జరిగిన నిర్ణయం మేరకే ఇప్పుడు బనకచర్లను ఏపీ సీఎం చంద్రబాబు ముందుకు తెస్తున్నట్లు అర్థమవుతుంది. అంతేకాకుండా 2019లో జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాకా.. 2019లో ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రగతిభవన్‌లో సమా వేశమై ' రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు తాను పెద్దన్నగా సహకరిస్తాన'ని కేసీఆర్ హామీ ఇచ్చారు.

## మా ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వండి!

కేసీఆర్ చెప్పడం వల్లే చంద్రబాబు బనకచర్ల చేపట్టారని, కానీ, గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీల కేటాయింపులు మాత్రమే ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టి వాడుకున్నాక మిగిలిన నీళ్లు కిందకు పోతే అవి వారు తీసుకుంటే ఎవ్వరికి అభ్యంతరం లేదు.. కానీ ఆ ప్రభుత్వం సమ్మక్కసాగర్, సీతరామ సాగర్‌తో పాటు గోదావరిలోని అన్ని ప్రాజెక్టులకు అభ్యంతరాలు చెబుతూ అనుమతులు రాకుండా చేస్తున్నది. అందుకే గోదావరిపై తెలంగాణ కట్టిన ప్రాజెక్టులకు 968 టీఎంసీలు వాడుకో వడానికి ముందుగా అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు. "రాష్ట్రానికి కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల ఏపీకి నీళ్లు వరదలెక్క వస్తున్నయ్.. మేడిగడ్డ కూలిపోయింది. సుందిళ్ల అక్కరకు రాలే.. అన్నారం గురించి చెప్పాల్సిన పనేలేదు. అవే సక్కగుంటే ఆ నీళ్లు ఎత్తిపోసుకునేటోళ్లం. అప్పుడు ఏపీకి నీళ్లు వస్తుండెనో, రాకుండెనో తెలుస్తుండే" అని సీఎం అంటున్న మాటలు వాస్తవమే కదా! కృష్ణా జలాల్లో 555 టీఎంసీలు, గోదావరిలో 1000 టీఎంసీల నీటిని వాడుకునేందుకు తెలంగాణకు ఎన్ఓసీ ఇస్తే మీ ప్రాజెక్టులపై మా తెలంగాణకు ఎలాంటి అభ్యంతరం లేదు. అలా కానీ పక్షంలో "బనకచర్లను ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు"ని ఏపీ సీఎంను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి అన్న మాటలను ఆషామాషీగా తీసుకోవద్దు. అందుకే ఈ విషయంలో రాష్ట్ర ప్రజలందరూ పార్టీలకు అతీతంగా రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలబడాలి.

## ఉద్యమం తప్పదా?

బనకచర్ల ప్రాజెక్టు అనేది కేవలం నీటి అంశం కాదు. ఇది తెలంగాణ జీవన స్థితిగతులపై రాజకీయ దాడి. ఇది ఓ రాజకీయ వివాదం కాదు. ఇది జీవన ప్రశ్న, కాళేశ్వరం కదలి వేళ్లలోకి పోయినా, బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లను తరలిస్తే తెలంగాణ పంటలు, జీవితాలు ఎండిపోతాయి. నీటి కోసం ఉద్యమించిన తెలంగాణ.. మళ్లీ నీటి కోసమే ఉద్యమించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. తెలంగాణ ఉద్యమంలో గోదావరి తీరంలో వేలమంది యువకులు, రైతులు "మా నీళ్లు మా వంటిల్లు దాటి పోకూడదు" అని ప్రాణాలిచ్చారు. ఇప్పుడు అదే గోదావరి నీటిని ఎత్తిపోసి, తెలంగాణ గుండెని ఎండబెట్టడాన్ని చూస్తూ ఊరుకుంటే.. అది మన అమరవీరుల త్యాగానికి విరుద్ధం. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే రేపటి తెలంగాణ ఎండిపోయిన ఎడారి భూమిగానే మిగిలిపోతుంది.